నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
నిజామాబాద్-కామారెడ్డి
గురువారం జనవరి 16, 2025 www.navatelangana.com

జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ పి.శ్రీనివాస్

నవతెలంగాణ-కంఠేశ్వర్



నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా ప్రొఫెసర్ డా. పి శ్రీనివాస్ బాధ్యతలు చేపట్టారు. మంగళవారం డాక్టర్ ప్రతిమారాజ్ నుంచి భాధ్యతలు స్వీకరించారు. జీజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా ఉన్న ప్రతిమారాజ్‌ను తొలగించి మెడికల్ కళాశాలలో విధలు నిర్వహిస్తున్న పిల్లల వైద్య నిపుణులు పి శ్రీనివాస్‌ను ఇంచార్జీగా నియమిస్తూ సోమవారం వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జడ్ చోంగ్తూ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్‌కు.. ప్రొఫెసర్లు, వైద్యులు, జూడాలు, ఆసుపత్రి సిబ్బంది పుష్ప గుచ్చాలు అందచేసి శుభాకాంక్షలు తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

నవతెలంగాణ-కంఠేశ్వర్

నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సబ్ ఇన్‌స్పెక్టర్ చంద్ర మోహన్, రహ్మతుల్లా సిబ్బంది వాహనాల తనిఖీ చేపట్టారు. నెంబర్ ప్లేట్ లేని 30 వాహనాలను, 10 అనధికార సైలెన్సర్ వల్ల శబ్ద కాలుష్యం చేస్తున్న మోటర్ సైకిల్‌లను సీజ్ చేసినట్టు తెలిపారు. వాహన దారులకు అవగాహన కల్పించారు. నిబంధనలను తప్పక పాటించాలన్నారు. పాటించని యెడల చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



వాహనదారులకు సూచనలిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

పోరాటాలతో పసుపు బోర్డు

- దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన ఆర్మూర్ ప్రాంత రైతాంగ ఉద్యమాలు
- 2006 నుంచి మొదలు.. దశలవారీగా పోరాటాలు
- రాజకీయాలు సైతం ప్రభావితం
- తాజాగా పసుపు బోర్డును ప్రారంభించడంతో హర్షాతిరేఖాలు

నవతెలంగాణ-ఆర్మూర్

పోరాటాలతో ఏదైనా సాధ్యమే అని మరోసారి నిరూపితమైంది. పసుపు బోర్డు కోసం ఆర్మూర్ రైతాంగం చేపట్టిన ఉద్యమం దేశ వ్యాప్తంగా చర్చనీయాంశం అయింది. దశలవారీగా జరిగిన పోరాటాలతో కేంద్ర ప్రభుత్వం స్పందించి జాతీయ పసుపు బోర్డును మంజూరు చేసింది. సంక్రాంతి పండుగ సందర్భంగా కేంద్ర మంత్రి పియూష్ గోయల్, నిజామాబాద్ ఎంపీ అరవింద్ వర్చువల్‌గా పసుపు బోర్డును ప్రారంభించారు. కాగా జాతీయ పసుపు బోర్డు చైర్మన్‌గా పల్లెగంగారెడ్డిని నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు నాయకులు పాల్గొన్నారు.

2006 నుంచి పసుపు రైతుల ఉద్యమం

2006 సంవత్సరంలో పసుపు పంట ధర క్వింటాలకు రూ. 1200 లోపే పలుకగా రైతులు ఎకరానికి రూపాయలు 25 వేల వరకు నష్టపోయారు. దీంతో రైతులు నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల్లో క్షేత్రస్థాయిలో సర్వేలు నిర్వహించి రైతులంతా ఏకమై ఉద్యమ బాటపట్టారు. 2007 ఫిబ్రవరి 6న పసుపు రైతులు జాతీయ రహదారులను దిగ్బంధించడం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపింది. ఈ నిరసన జిల్లా ఉద్యమాల చరిత్రలో కొత్త ఉరవడిని సృష్టించింది. అప్పటి ముఖ్య మంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి స్పందించి మార్క్ ఫైడ్ ద్వారా కొనుగోలు చేయడానికి మద్దతు ధర ప్రకటించారు. 2008లో మళ్లీ అదే పరిస్థితి నెలకొనగా స్వదేశీ జాగారణ మంచ్ ఆధ్వర్యంలో 300 కిలోమీటర్లు పాదయాత్ర నిర్వహించారు. 2009లో ప్రతికూల పరిస్థితులను తట్టుకోలేక రైతులు పసుపు పంట విస్తీర్ణం తగ్గించారు. దీంతో క్వింటాలకు 15 వేల నుండి 18 వేల దాకా పలికింది. 2010లో శాశ్వత మద్దతు ధర కోసం పసుపు బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు ఢిల్లీలో ధర్నా చేపట్టారు. 2011లో రాష్ట్ర ప్రభుత్వం 4 వేల మద్దతు ధర నిర్ణయిస్తూ కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించగా, కేంద్రం అదే ధరను మద్దతు ధరగా నిర్ణయించగా పెట్టుబడి, వ్యయం కూడా తిరిగి రాక రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో పసుపు రైతులకు మేలు జరగలేక పాలకులు, రైతుల డిమాండ్లకు అనుకూలంగా స్పందించని కారణంగా, గిట్టుబాటు ధర కోసం అన్నదాతలు గత కొన్ని ఏళ్లుగా ఆందోళనకు దిగడం ఆనవాయితీగా వస్తుంది.

వారణాసికి చేరిన పసుపు బోర్డు పంచాయితీ

2019లో నిజామాబాద్ పార్లమెంటు స్థానానికి నామినేషన్లు దాఖలు చేసిన రైతులు, మరోవైపు ప్రధాని మోడీ ప్రాతినిధ్యం వహిస్తున్న వారణాసి లోక్‌సభ నియోజకవర్గ బరిలోకి దిగేందుకు జిల్లా ప్రాంత రైతులు తరలివెళ్లారు. అర్బన్, రూరల్ బాల్కొండ, ఆర్మూర్ నియోజక వర్గాల నుండి 54 మంది పసుపు రైతులు తమిళనాడులోని ఈరోడ్‌కు చెందిన పసుపు రైతుల సంఘం జాతీయ అధ్యక్షుని సహకారంతో నామినేషన్లు



పసుపు బోర్డు కోసం జేఏసీగా ఆందోళన చేపట్టిన రైతులు(ఫైల్)

వేయడానికి పూనుకోగా అక్కడి పోలీసులు వారిని భయాందోళనకు గురి చేశారు.

కాగా నిజామాబాద్ ఎంపీ స్థానానికి నామినేషన్ల పరిశీలన ఉపసంహరణ తర్వాత 185 మంది అభ్యర్థుల బరిలో ఉండగా అందులో 178 మంది రైతులే కావడం విశేషం. జిల్లా పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్ తాను గెలిస్తే పసుపు బోర్డు ఏర్పాటు చేయిస్తానని, లేకుంటే ఎంపీ పదవికి రాజీనామా చేసి రైతులతో కలిసి ఉద్యమిస్తానని బాండ్ పేపర్‌పై రాసిచ్చి ఎన్నికలలో గెలుపొందారు. కాగా బోర్డు ఏర్పాటులో జాప్యం కావడంతో ఆయనపై విమర్శలు వచ్చాయి. ఎట్టకేలకు నిజామాబాద్‌లో ఏర్పాటు చేయనున్నట్లు కేంద్రం స్పష్టం చేయడంతో రైతుల పోరాటం సహకారమై, ఎంపీ హామీ నెరవేరినట్టయింది.

నైజాం కాలం నాటి పసుపు సాగు

నిజామాబాద్ జిల్లాలో నైజాం కాలం నుంచి పసుపు సాగు కొనసాగుతోంది. అప్పటి నుంచి మూడు తరాల రైతు కుటుంబాలు ఈ పసుపు సాగును కొనసాగిస్తున్నాయి. గతంలో ధర బాగా ఉన్న సమయంలో జిల్లాలో 45 వేల నుంచి 50 వేల ఎకరాల్లో పసుపు పంట సాగు అయ్యేది. కానీ పసుపునకు భారీగా ధర తగ్గడం పెట్టుబడులు పెరగడం వల్ల రైతులు పంట విస్తీర్ణాన్ని తగ్గించుకున్నారు. 2023వ సంవత్సరం 20వేల ఎకరాలలోపే జిల్లాలో సాగు చేశారు. ఇతర జిల్లాల్లోనూ ధర లేకపోవడం వల్ల పసుపు సాగు తగ్గింది. ప్రతిసారి పెట్టుబడులు పెరుగుతుండడం, కూలీల కొరత ఉండటం వల్ల కొంతమంది రైతులు వరి, మొక్కజొన్న, సోయా పంటల వైపు మొగ్గారు.

కాగా సాగు విస్తీర్ణం తగ్గడంతో డిమాండ్ మాత్రం భారీగా పెరిగింది. ఎగుమతులను ప్రోత్సహించడం వల్ల ధర పెరుగుతూ వచ్చింది. గరిష్టంగా క్వింటాలు 13 వేల నుండి 15,000 మధ్య ఎక్కువగా అమ్మకాలు జరిగాయి. కాగా ఈసారి పసుపు వల్ల పెట్టుబడి డబ్బులతో పాటు పాటు లాభాలు కూడా ఎక్కువ మొత్తంలో వచ్చాయి. తెలంగాణలో సుమారుగా 55 వేల ఎకరాలలో పసుపును రైతులు సాగు చేస్తున్నారు. ఒక్క జిల్లాలోనే 33 వేల ఎకరాలలో సాగు అవుతుంది. గత సంవత్సరం ఫిబ్రవరిలో సీజన్ మొదలైన వారం రోజుల్లో 12 క్వింటాళ్ల ఫింగర్ బల్బు అనే రకాల పసుపు వచ్చింది.

65 శాతం జిల్లా మార్కెట్‌కు

రాష్ట్రంలో పండే పసుపునకు 65 శాతం నిజామాబాద్ మార్కెట్ వస్తుండగా 20 శాతం పసుపు మహారాష్ట్రలోని సాంగ్లి మార్కెట్‌కు వెళ్తోంది. మరో 15 శాతం వరంగల్, కేసముద్రం, వికారాబాద్ మార్కెట్‌కు తరలుతోంది. 2022-23 సీజన్లో జిల్లా మార్కెట్ కు 7.49 లక్షల క్వింటాళ్లు వచ్చింది. నిజామాబాద్ మార్కెట్ నుంచి పసుపు ఇరాన్ బంగ్లాదేశ్ అరబ్ దేశాలకు ఎగుమతి చేస్తున్నారు.

బోర్డుతో.. వంగడాల అభివృద్ధి నుంచి ఎగుమతుల వరకు

జిల్లాలో పసుపు బోర్డు ఏర్పాటయితే కొత్త వంగడాల అభివృద్ధి నుండి మొదలుకొని, మేనేజ్మెంట్ మార్కెటింగ్ వరకు రైతులకు లబ్ధి కలగనుంద. అవసరాన్ని బట్టి పసుపు బోర్డు రైతులకు విత్తనం అందించి బై బ్యాక్ ఒప్పందం సైతం చేసుకుంటారు. రైతులకు రాయితీలు పెరుగుతాయి. పసుపు తవ్వకం, ఆరబెట్టడం, ఉడకబెట్టడం , డ్రై చేయడం ,పాలిష్ చేయడానికి అవసరమైన యంత్రాలను రాయితీపై అందిస్తారు. పసుపు పంట మార్కెటింగ్ కోసం అంతర్జాతీయ కంపెనీలను తీసుకువచ్చే బాధ్యత సైతం బోర్డు తీసుకుంటది.

పసుపు పంట విస్తీర్ణం పెరుగుతది

గుగులోత్ తిరుపతి నాయక్, నెహ్రూ యువ కేంద్రం జిల్లా అడ్వైజర్ కమిటీ మెంబర్, బిజెపి నాయకులు, ఆర్మూర్.



పసుపు బోర్డు ఏర్పాటయితే మున్ముందు పసుపు పంట సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది. బోర్డు నుంచి అంతర్జాతీయ పసుపు వాణిజ్యం మరింత విస్తృతం అవుతది. జాతీయ స్థాయిలో పసుపు బోర్డు ఏర్పాటుకు కృషి చేసిన ఎంపీ అరవింద్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నాం. పసుపు బోర్డు చైర్మన్‌గా నియమితులైన పల్లె గంగారెడ్డికి శుభాకాంక్షలు.

రైతన్నల సంక్షేమానికి కృషి

పైడి రాకేష్ రెడ్డి, ఎమ్మెల్యే, ఆర్మూర్.



గత శాసనసభ ఎన్నికలకు ముందు జిల్లా కేంద్రానికి వచ్చిన ప్రధాని మోడీ నిజామాబాద్‌లో పసుపు బోర్డు మంజూరు చేస్తున్నట్లు అధికారికంగా ప్రకటన చేశారు. దీంతో రెండు అసెంబ్లీ స్థానాలలో భారీ ఓట్లతో విజయం సాధించాం. రైతు కుటుంబం నుండి వచ్చిన మా గ్రామానికి చెందిన పల్లె గంగారెడ్డి జాతీయ పసుపు బోర్డు చైర్మన్‌గా నియామకం కావడం అభినందనీయం. రైతన్నల సంక్షేమానికి మోడీ ప్రభుత్వం కృషి చేస్తోంది.



జాతీయ పసుపు బోర్డు చైర్మన్‌గా నియమితులైన పల్లె గంగారెడ్డికి సన్మానం

నిజామాబాద్‌లోనే.. పసుపు బోర్డు

వర్చువల్‌గా ప్రారంభించిన కేంద్ర మంత్రి పియూష్ గోయల్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

'పసుపు బోర్డు ఏర్పాటు కోసం కోసం దశబ్దాలుగా నిజామాబాద్ జిల్లా రైతులు పోరాటం చేస్తున్నారు. రైతుల శ్రేయస్సు కోసం పసుపు బోర్డును నిజామాబాద్‌లో ఏర్పాటు చేస్తున్నట్టు' ఎంపీ అరవింద్ తెలిపారు. జాతీయ పసుపు బోర్డు ఏర్పాటు చేసిన ప్రధాని మోడీకి కేంద్రమంత్రులకు ఎంపి అర్వింద్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మోడీ నిజామాబాద్ రైతులకు ఇచ్చిన మాటకు కట్టు బడి పసుపు బోర్డు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. జాతీయ పసుపు బోర్డును ఢిల్లీ నుంచి వర్చువల్‌గా కేంద్రమంత్రి పీయూష్ గోయల్, ఎంపీ అరవింద్ ధర్మపురి ప్రారంభించారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంగా పనిచేయనున్న పసుపు బోర్డును ఓ ప్రైవేట్ హోటల్‌లో ఏర్పాటు చేసిన వేదికగా మంగళవారం ప్రారంభించారు.

మోడీ ఆశీర్వాదంతో పసుపు బోర్డు నిజామాబాద్‌లో ఏర్పాటు చేస్తున్నట్లు కేంద్ర వాణిజ్య మంత్రి పియుష్ గోయల్ ఆన్‌లైన్‌లో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాని మోడీ ఆశీస్సుల కారణంగానే పసుపు బోర్డు నిజామాబాద్‌లో ఏర్పాటు చేశామని, తొలి పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డికి అభినందనలు తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా రైతుల ఉత్పత్తులు ఇతర అనేక ఉత్పత్తులు గతంలో ఎక్కువగా ఎగుమతి అయ్యేవి కాదు అని ప్రధాని మోడీ కృషితో ఆ పరిస్థితి మారిందన్నారు. అనేక దేశాలు భారత్ ఉత్పత్తులు తీసుకునే పరిస్థితి ఏర్పడిందని, తెలంగాణ ఆంధ్రాలో నాణ్యమైన పసుపు పండిస్తారని, అందుకే నిజామాబాద్‌లో పసుపు బోర్డు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

నిజామాబాద్‌లో జాతీయ పసుపు బోర్డు ఏర్పాటు కోసం ఎంపీ ధర్మపురి అరవింద్ కృషి చాలా ఉందని, పసుపు సాగు నాణ్యత మరింత పెంచాల్సిన అవసరం ఉందన్నారు. పసుపు ప్రాధాన్యం కరోనా సమయంలో అందరికీ తెలిసిందని, పసుపు ఆరోగ్య శాఖలో ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా మార్కెటింగ్ ఎగుమతి రవాణా అన్నింటిపై కేంద్రం ఆధ్వర్యంలో పసుపు బోర్డు దృష్టి సారిస్తుందని, 40 సంవత్సరాల రైతుల పసుపు బోర్డు కల నిజం చేశామని పేర్కొన్నారు. దీని వల్ల పసుపు రైతుల అభివృద్ధికి మరింత పసుపు బోర్డు పనిచేయడం ప్రారంభిస్తుందని, స్పైస్ బోర్డు నిధులను ప్రస్తుతం దీనికి ఉపయోగిస్తామని తెలిపారు. వచ్చే బడ్జెట్‌లో పసుపు బోర్డుకు తగిన నిధులు ఇస్తామన్నారు. పసుపు బోర్డుకు తగ్గిన అధికారులు సిబ్బందిని కేటాయిస్థామని తెలిపారు. రెండేళ్లలో పసుపు ఉత్పత్తి రెండింతలు చేస్తామని సూచించారు. ఈ ప్రారంభ కార్యక్రమంలో పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి, స్పైసెస్ బోర్డు నేషనల్ సెక్రటరీ రమశ్రీ సుబ్రహ్మణ్యంలు రైతులు పాల్గొన్నారు.



పసుపు బోర్డును ప్రారంభించిన కేంద్ర మంత్రిని పసుపుకొమ్ముల దండతో సన్మానిస్తున్న ఎంపీ

కమిషనరేట్‌కు భీంగల్ సీఐ అటాచ్

నవతెలంగాణ-కంఠేశ్వర్/భీంగల్ రూరల్



భీంగల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నవీన్‌పై బదిలీ వేటు పడింది. సర్కిల్ బాధ్యతల నుంచి తప్పిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. భీంగల్ పరిధిలో జరిగిన పలు ఘటనల నేపథ్యంలో జిల్లా ఇంచార్జ్ పోలీస్ కమీషనర్ సింధూ శర్మ విచారణ జరిపించినట్టు సమాచారం. వివరాల్లోకి వెళ్తే.. భీంగల్ పట్టణానికి చెందిన సత్య గంగయ్య తన కేసు విషయంలో తన లోకేషన్ సిఐ ట్రేస్ చేసి నిందితులకు అందజేశాడని, దాంతోనే తనపై దాడి చేశారని ఆరోపించారు. ఈ ఘటనలో ఇన్‌చార్జి సీపీ ఆర్మూర్ ఏసీపీతో విచారణ చేయించినట్టు సమాచారం. తనపై దాడికి పూర్తి బాధ్యత సిఐ నవీన్‌దేనని బాధితుడు ఆర్మూర్ ఏసీపీ విచారణలో చెప్పినట్టు సమాచారం. అందులో భాగంగా ముందుగా భీంగల్ సీ.ఐ నవీన్‌ను హెడ్ క్వార్టర్‌కు అటాచ్ చేస్తూ ఉత్తర్వులను జారీ చేశారు. సంబందిత విచారణ నివేదికను మల్టీ జోన్ 1 ఐజీకి రిపోర్టు చేశారు. ఐజీ సిఐపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది. భీంగల్ సీఐ నవీన్, ఎస్సై మహేష్‌లపై వచ్చిన అవినీతి ఆక్రమాల విచారణ అనంతరం ఎస్సైపై కూడా వేటు పడడం ఖాయమని తెలుస్తోంది.

మాంజా నుంచి రక్షణకు బైక్‌లకు ఇనుప తీగలను బిగించుకోండి



నవతెలంగాణ-కామారెడ్డి

మాంజాల నుంచి రక్షణ పొందేందుకు ద్విచక్రవాహనదారులు తమ వాహనంపై ఇనుప తీగలను ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు సూచించారు. బుధవారం నిజం సార్ చౌరస్తాలో కొన్ని వాహనాలకు పోలీసులు స్వయంగా మోటార్ సైకిల్ హ్యాండిల్‌లకు బిగించి వాటి అవసరం పై అవగాహన కలిగించారు. తీగలను ముందు బాగానే బిగించుకోవడం వలన గాలిపటం ఎగరవేయడానికి ఉపయోగించే మాంజా గాని, మరేదైన దారము గాని నడిపే వ్యక్తులకు తగలకుండా ఉంటుంది. మోటార్ సైకిల్ నడిపే వ్యక్తులు తమ మోటార్ సైకిల్ లను నడిపేటప్పుడు హెల్మెట్ పెట్టుకొని జాగ్రత్తగా నడపాలని వీలైతే దారం లాంటివి తగలకుండా ఉండేందుకు ఈ విధంగా ఏర్పాటు చేసుకోవాలని పట్టణ సీఐ చంద్రశేఖర్ రెడ్డి సూచించారు.

జగజీత్ సింగ్ దల్లేవాలా ప్రాణాలకు ముప్పు వాటిల్లితే కేంద్ర ప్రభుత్వానిదే బాధ్యత

- వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘాల నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

జగజీత్ సింగ్ దల్లె వాలా ప్రాణాలకు ముప్పు వాటిల్లితే కేంద్ర ప్రభుత్వానిదే బాధ్యతని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘాల నాయకులు అన్నారు. బుధవారం జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ది వెంకట్రాములు, పల్లపు వెంకటేష్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం రైతుల సమస్యతో చిత్తశుద్ధితో లేదు. రైతుల సమస్యలు పరిష్కారం చేయాలని రైతు నాయకుడు జగజ్జిత్ సింగ్ దల్లేవాలా ఆమరణ దీక్షకు పూనుకున్నాడు. నేటికీ 48 రోజులు గడుస్తుంది, పూర్తిగా ఆయన ఆరోగ్యం క్షీణించిపోయింది. అయినా ఈ ప్రభుత్వానికి మాత్రం సోయి లేకుండా నిర్లక్ష్యం చేస్తుంది. ఒకవేళ దల్లేవాలా ప్రాణానికి ఏదైనా జరిగితే మోడీ ప్రభుత్వమే బాధ్యత వహించాలి హెచ్చరించా'లన్నారు. ఈ ప్రభుత్వం రైతాంగ సమస్యలను పూర్తిగా పరిష్కరించాలని, తెలంగాణ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాలు నిరసిస్తున్నాయి. ఎస్కేయం ఆధ్వర్యంలో జనవరి 26 తేదీన ట్రాక్టర్ పరేడ్ దేశవ్యాప్తంగా నిర్వహించాలని పిలుపునిచ్చింది. ఆ రోజున జరిగే సమరశీర పోరాటాన్ని ప్రభుత్వం చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు. అయినా సమస్య పరిష్కారం కాకపోతే పోరాటాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు దేవేందర్ సింగ్, శేఖర్ గౌడ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

రోడ్డు పునర్ నిర్మాణంలో నిర్లక్ష్యం

- ప్రయాణికులకు ఇబ్బందులు



నవతెలంగాణ-రామారెడ్డి

రోడ్డు పునర్ నిర్మాణంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, అధికారుల ముందస్తు జాగ్రత్తలు తీసుకోక పోవడంతో ప్రయాణికులకు తీవ్ర ఇబ్బంది ఎదురవుతుంది. గత మూడు నెలల క్రితమే నవ తెలంగాణలో "ఆరు నెలలు అయినా రోడ్డు పూర్తికాలేదు" అనే శీర్షికతో కథనం ప్రచురించగా.. అధికారులు పనులు చేపడతామని చెప్పి, రోడ్డు పునర్నిర్మాణం చేపట్టకపోవడంతో బుధవారం రెడ్డిపేట నుండి ఘన్పూర్ వైపు, గన్ పూర్ వైపు నుండి రెడ్డి పేట వెళ్తున్న రెండు వాహనాలు ఎదురు కావడంతో అసంపూర్తిగా ఉన్న మట్టి రోడ్డుపై రెండు వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ద్విచక్ర వాహనదారులకు, ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందిని ఎదుర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రోడ్డు నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు, ప్రయాణికులు ప్రభుత్వాన్ని, అధికారులను కోరుతున్నారు.

ఆర్‌పీలకు నవంబర్ నెల వేతనం ఇప్పించాలి

- కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేసిన ఆర్పీలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

రిసార్స్ పర్సన్స్ (ఆర్‌పీ)లకు నవంబర్ నెల జీతం ఇప్పించాలని కలెక్టరేట్‌లో బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెప్మా పరిధిలో పని చేస్తున్న తమలో కొద్ది మంది వివిధ రకాల ఆరోగ్య సమస్యల వల్ల సమగ్ర కుటుంబ కులగణన సర్వే చేయలేక పోయారని తెలిపారు. ఇప్పటి వరకు ప్రభుత్వం 5 రకాల సర్వేలు ఇచ్చినా చేసినట్టు తెలిపారు. ఆరోగ్య సమస్యవల్ల ఈ ఒక్క సర్వే చేయలేదని, ఈ విషయం ఉన్నతాధికారులకు సైతం విన్నవించినట్టు తెలిపారు. తమ టూర్ డైరీలను అధికారులకు అందజేశామని, కానీ ఈ ఒక్క సర్వే చేయలేదనే కారణంగా పై అధాకారులు నవంబర్ నెల టూర్ డైరిలను సబ్మిట్ చేయకపోవడంతో ఆ నెల వేతనం ఇప్పటికీ అందలేదని తెలిపారు. 6000 వేతనంతో పని చేస్తున్నామని, ఆ ఒక్క సర్వే చేయలేని కారణంగా వేతనం అపారని, ఆర్పీల్లో ఎక్కువ మంది ఒంటరి మహిళలే పని చేస్తున్నారని తెలిపారు. జీతం ఆపివేయడం వల్ల అనేక ఆర్థిక ఇబ్బందులకు గురికావాల్సిన పరిస్థితి నెలకొంది. కావున తమ ద్వారా విన్నవిస్తూ జీతం ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నామన్నారు.

పని భారం, ఆర్థిక భారంతో తల్లిడిల్లుతున్న జీపీ కార్యదర్శులు

నవతెలంగాణ-రామారెడ్డి

గ్రామ పరిపాలనాధికారిగా గ్రామ సమస్యలతో పాటు, ఆర్థిక లావాదేవీలు, సర్వేలు పంచాయతీ కార్యదర్శులను ఉక్కిరిబిక్కి చేస్తున్నాయని వారు వాపోతున్నారు. గ్రామాల్లో సర్పంచులు లేకపోవడంతో.. ప్రభుత్వం నుండి నిధులు మంజూరు కాకపోవడంతో అన్ని తామై ముందు నుయ్యి వెనుక గొయ్యిల పంచా యతీ కార్యదర్శుల ఇబ్బందులు వర్ణనాతీతంగా మారాయి. సమస్యలను పరిష్కరించకపోతే గ్రామస్తుల నుండి ఒత్తిడి, సమస్యలు పరిష్కరించాలంటే ఆర్థిక పరిస్థితులతో కార్యదర్శులు ఇబ్బంది పడుతున్నారు. వాటితో పాటు అనేక సర్వేలను పంచాయతీ కార్యదర్శులకు బాధ్యతలు అప్పజెప్పి పని భారాన్ని పెంచడంతో గ్రామ సమస్యల పరిష్కారానికి సమయం వెచ్చించలేకపోతున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 526 గ్రామపంచాయతీని ఉన్నాయి. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లోని సమస్యలు పరిష్కరించాలంటే గ్రామపంచాయతీలో నిధులు లేకపోవడం ప్రధాన సమస్యగా మారింది. కార్యదర్శులు జీపి సామర్థ్యాన్ని బట్టి రూ 30 వేల నుండి రు 2 లక్షల వరకు సొంత డబ్బులను ఖర్చు చేస్తూ ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. సమగ్ర సర్వే ఇందిరమ్మ ఇండ్ల సర్వే, ఎన్నికల్లో విధులు వంటి సర్వేలతో పని భారాన్ని పెంచడంతో, ప్రజలకు అందుబాటులో ఉండలేక, సకాలంలో సమస్యలను పరిష్కరించలేక పోవడంతో ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి గ్రామ పంచాయతీలకు నిధులు కేటాయించి ప్రజా సమస్యలను పరిష్కరించాలని, స్థానిక సంస్థల ఎలక్షన్లను నిర్వహించి పంచాయతీ కార్యదర్శులకు పని భారాన్ని తగ్గించాలని కార్యదర్శుల సంక్షేమ సంఘం కోరుతుంది.



వ్యాధి నిరోధక టీకాలు తప్పకుండా అందేలా చూడాలి

- మామిడిపల్లి ఆరోగ్య ఉపకేంద్రం తనిఖీ



నవతెలంగాణ-ఆర్మూర్

వ్యాధి నిరోధక టీకాలు ప్రతి ఒక్క చిన్నారికి అందే విధంగా చూడాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ అశోక్ ఆదేశించారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి ఆరోగ్య ఉప కేంద్రాన్ని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధి నిరోధక టీకాల లబ్ధిదారుల జాబితాను ముందస్తుగా తయారు చేసుకుని ప్రతి చిన్నారికి టీకాలు అందే విధంగా ఆశా కార్యకర్తలు చూడాలని ఆదేశించారు వ్యాక్సిన్ కోల్డ్ చైల్డ్ పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి సాయి, ఆరోగ్య కార్యకర్తలు జక్కుల మోహన్, శ్యామల, ఆశా కార్యకర్తలు సుభద్ర, శిరీష, అరుణ, రమ, గర్భిణి స్త్రీలు బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

గల్ఫ్ మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలో కొనసముందర్ గ్రామానికి చెందిన మదాస్తు నర్సయ్య కుటుంబానికి గల్ఫ్ మిత్రులు బుధవారం రూ.74వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. బతుకుదెరువు కోసం కొద్ది సంవత్సరాల క్రితం దుబాయ్ వెళ్లిన నర్సయ్య ఇటీవల అనారోగ్యంతో చికిత్స పొందుతూ అక్కడే మృతి చెందాడు. నరసయ్యతో కలిసి దర్వేజ్ కంపెనీలో పని చేస్తున్న మిత్రులు అందరూ తలా కొంత కలిపి రూ.74వేలు పోగు చేశారు. ఆ మొత్తాన్ని కోన సముందర్ లో ఉన్న స్నేహితులకు పంపించార. వారు ఆర్థిక సహాయాన్ని మృతుడు నర్సయ్య కుటుంబ సభ్యులకు అందించారు. నర్సయ్య కుటుంబాన్ని ఆదుకున్న గల్ఫ్ లో ఉన్న మిత్రులకు గ్రామస్తులు, మృతుని కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎక్కల్ దేవ్ లక్ష్మీ నరసయ్య, కల్ల సతీష్, ఏ.ధనుష్, కే.అన్వేష్, గట్టు హన్మాండ్లు, బాపు రెడ్డి, కే.సురేష్, ఏ.శ్రీకాంత్, ఏ.ప్రశాంత్, తది తరులు పాల్గొన్నారు.

పసుపు బోర్డుతో గిట్టుబాటు ధర

- పసుపు బోర్డు ఏర్పాటుపై సంబరాలు
- పల్లె గంగారెడ్డికి సన్మానాలు

నవతెలంగాణ-విలేకరుల బృందం

జక్రాన్‌పల్లి : పసుపు బోర్డు ఏర్పాటు పట్ల నిజామాబాద్ జిల్లా కిషన్ మోర్చా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లెగంగారెడ్డిని మంగళవారం శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. 30 సంవత్సరాల రైతుల పోరాటాల ఫలితంగా పసుపు రైతు ఎదురు చూస్తున్న జాతీయ పసుపు బోర్డును నిజామాబాద్ జిల్లా కేం ద్రంలో ఏర్పాటు చేసిన నిజామాబాద్ పార్లమెంటు సభ్యులు అరవింద్ ధర్మపురికి ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మొట్టమొదటిసారిగా జాతీయ పసుపు బోర్డు అధ్యక్షుడిగా నియమించబడ్డ నిజామాబాద్ జిల్లా ఆదర్శ గ్రామం అంకాపూర్ గ్రామానికి చెందిన పల్లె గంగారెడ్డికి జేఎం కేపీఎం రైతు ఉత్పత్తి దారుల సంఘం తరపున సన్మానించారు. భవిష్యత్తులో పసుపు బోర్డు వల్ల ఎన్నో రకాల లాభాలు రైతులకు కల్పించాలని పసుపు బోర్డు చైర్మన్‌కు మనవి చేశారు.

జాతీయ పసుపు బోర్డు చైర్మన్ లంబాడి హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు మోహన్ శాలువాతో పూలమాలతో సన్మానించారు. పల్లెగంగారెడ్డి(అంకాపూర్ గ్రామం) జాతీయ (ఇండియా)పసుపు బోర్డు చైర్మన్‌గా ఎన్నికైన సందర్భంగా శు భాకాంక్షలు తెలియజేశారు.

మోడీ చిత్రపటానికి పాలాభిషేకం

మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విగ్రహానికి మండల బిజెపి నాయకులు పాలాభిషేకం బుధవారం చేశారు. ఇటీవల జాతీయ పసుపు బోర్డు ఏర్పాటు చేసి జాతీయ చైర్మన్గా పల్లె గంగారెడ్డి నియమించడంతో మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రధానమంత్రి నరేంద్రమోడీ, ఎంపీ అరవింద్, నిజాంబాద్ బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్, పసుపు బోర్డు జాతీయ చైర్మన్ పల్లె గంగారెడ్డి చిత్రపటాలకు మండల బిజెపి అధ్యక్షుడు కన్నెపల్లి ప్రసాద్ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మండల బిజెపి పార్టీ అధ్యక్షుడు కన్నెపల్లి ప్రసాద్, జిల్లా కిషన్ మోర్చా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, మునుపెల్లి రాజ రెడ్డి, తిరుపతి రెడ్డి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్ : పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద 30 దశాబ్దాల రైతుల కల పసుపు బోర్డు, జిల్లా పసుపు రైతు అంకాపూర్ వాసి పల్లె గంగారెడ్డికి బోర్డ్ చైర్మన్ పదవి రావడంతో మంగళవారం రైతులు, బిజెపి నాయకులు, కార్యకర్తలు టపాసులు కాల్చి స్వీట్లు పంచుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. బిజెపి పట్టణ అధ్యక్షులు మందుల బాలు, రూరల్ అధ్యక్షులు వినోద్ కుమార్, సీనియర్ నాయకులు భూపతి రెడ్డి, జిల్లా కిసాన్ మోర్చా నాయకులు నూతల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. 30 దశాబ్దాల రైతుల కల పసుపు బోర్డు ఏర్పాటు జిల్లాలో అధిక శాతం పసుపు రైతులు ఉండటం వారి కలను సహకారం చేయడానికి పార్లమెంటు సభ్యులు ధర్మపురి అరవింద్ పాద యాత్రగా జగిత్యాల నుండి నిజామాబాద్ జిల్లాలో తిరుగుతూ పసుపు బోర్డ్ సాధించడమే లక్ష్యంగా పెట్టుకొని బాండ్ పేపర్ రాసి ఇచ్చి గెలిచారన్నారు. అపర భగీరథుడు ఎంపీ అని, మాట ఇస్తే నిలబెట్టుకుంటారని నిరూపిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నిజామాబాద్‌లో ప్రకటించడం, ఆ తర్వాత కేంద్ర మంత్రి అమిత్‌షాతో నిజామాబాద్‌లోనే కార్యాలయం ఏర్పాటు చేయిస్తానని చెప్పి మాట ఇప్పించడం కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌తో జిల్లా కేంద్రంగా జాతీయ పసుపు బోర్డు ప్రారంభించడం చేశారన్నారు. కార్యకర్త నుండి మండల అధ్యక్షులుగా, జిల్లా అధ్యక్షులుగా రాష్ట్ర కార్యదర్శిగా అంకాపూర్ రైతు పల్లె గంగారెడ్డికి జాతీయ పసుపు బోర్డు మొదటి చైర్మన్‌గా ప్రకటించారన్నారు. రైతుల తరపున వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు పార్టీ నాయకులు రైతులకు శుభాకాంక్షలు తెలిపారు. ఇకనుండి పసుపు ఎగుమతి పసుపునకు సంబంధించిన రకాలు పరిశోధనలు రైతులకు మేలు చేస్తూ పరోక్షంగా ఎంతో మందికి ఉపాధి కలిగిస్తుందని అన్నారు. దీనివల్ల జిల్లాకు దేశంలో గుర్తింపు వస్తుందని తెలిపారు. జక్రాన్ పల్లి విమానాశ్రయం ప్రారంభమైతే ఇక జిల్లా కేంద్రంగా అన్ని కార్యక్రమాలు, ఇంకొన్ని పరిశ్రమలు రావడానికి ఆస్కారం ఉంటుందని తెలిపారు. ఆర్మూర్ ప్రాంతం అత్యధిక పసుపు పండిస్తున్న రైతులు ఉన్నారు కాబట్టి అన్ని విధాలుగా ఆర్మూర్ అభివృద్ధి పథంలో దూసుకుపోవడానికి పుష్కలంగా అవకాశాలు ఉన్నాయన్నారు. రైతులకు ఇక పసుపు కొంగు బంగారంగా కానుంది అని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి జెస్సు అనిల్ కుమార్, కలిగోట గంగాధర్, గుగులోత్ తిరుపతి నాయక్ , ఆకుల శీను, సుంకరి రంగన్న, జిల్లా కార్యవర్గ సభ్యులు విజయ ఆనంద్, కిసాన్ మోర్చా అధ్యక్షులు శేషగిరి లింగం ,పట్టణ ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, మోర్చాల అధ్యక్షులు, శక్తి కేంద్ర ఇన్చార్జులు, భూత్ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు

పల్లె గంగారెడ్డికి సన్మానం

ఎడపల్లి : జాతీయ పసుపు బోర్డు చైర్మెన్‌గా నియమితులైన పల్లె గంగారెడ్డికి బీజేపీ జిల్లా నాయకులు కందగట్ల రాంచందర్(అన్నాసేట్) ఆధ్వర్యంలో మంగళవారం సన్మానం చేశారు. జిల్లా శాసన సభ్యులు ధనపాల్ సూర్యనారాయణ గుప్తా, పైడి రాకేష్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్‌ను కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు మల్లెపూల శ్రీనివాస్, మండల ఉపాధ్యక్షులు నాయిని లక్ష్మణ్ గౌడ్, నాయకులు ద్యాకం సాయిరెడ్డి, కంజరి అభినవ్, ప్యాట గంగాధర్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్ కేంద్రంగా జాతీయ పసుపు బోర్డును ఏర్పాటును హర్షిస్తూ ప్రధాని నరేంద్ర మోడీ, పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అర్వింద్ చిత్ర పటాలకు మండల భాజపా నాయకులు బుధవారం క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు కందగట్ల రాంచందర్(అన్నాసేట్), బోధన్ నియోజక వర్గ అసెంబ్లీ కన్వీనర్ శ్రీధర్, మండల పార్టీ అధ్యక్షులు కోల ఇంద్రకరణ్, బూత్ అధ్యక్షులు, నాయకులు, పాల్గొన్నారు.

ప్రధాని, ఎంపీ చిత్రపటాలకు పాలాభిషేకం

ఏర్గట్ల : నిజామాబాద్‌లో రైతుల కోసం పసుపు బోర్డు ఏర్పాటుచేయడంతో ఏర్గట్ల మండల బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోడీ, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ చిత్రపటాలకు బుధవారం పాలాభిషేకం నిర్వహించారు.ఈ సందర్భంగా బీజేపీ మండలాధ్యక్షులు నారాయణ రెడ్డి మాట్లాడుతూ..ఎంపీ అరవింద్ 2019 లో రైతులకు ఇచ్చిన హామీ ని నెరవేర్చారని, రైతు అయిన పల్లె గంగారెడ్డి గారిని బోర్డుకు చైర్మన్ గా నియమించడం ఆనందదాయకంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో గుమ్మిర్యాల్ మాజీ ఎంపీటీసీ బొల్లి శంకర్, నాయకులు సోమ బంగ్లా రాజారెడ్డి,బద్దం సురేష్,ప్రశాంత్, పవన్, ఘన శ్యామ్ , జీవన్, విఠల్ , ఆనందం గంగేష్ , తదితరులు పాల్గొన్నారు.

పసుపు బోర్డు ఏర్పాటు చేసినందుకు ధన్యవాదాలు

మోపాల్ : నిజామాబాద్ జిల్లాకు జాతీయ పసుపు బోర్డుని ప్రకటించిన దేశ ప్రధాని నరేంద్ర మోడీకి యావత్ పసుపు రైతుల తరపున నిజామాబాద్ జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు, నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి బుధవారం కృతజ్ఞతలు తెలిపారు.

రంగవల్లి ద్వారా ప్రధానికి ధన్యవాదాలు..

మండలకేంద్రంలో మంగళవారం నిజామాబాద్ జిల్లా ప్రజల ఎన్నో సంవత్సరాల కల అయిన పసుపు బోర్డును ఏర్పాటు చేసిన సందర్భంగా ప్రధాని మోడీకి విన్నుతంగా ముగ్గురూపంలో ధన్యవాదాలు తెలిపారు. మొపాల్ గ్రామానికి చెందిన అంగలి లక్ష్మి గంగారెడ్డి దంపతులు ప్రధాని నరేంద్ర మోదీకి నిజామాబాద్ ఎంపీ అరవింద్‌కు విన్నుతంగా ధన్యవాదాలు తెలిపారు.

పసుపు బోర్డు సాధించడం పట్ల వినూత్నంగా ధన్యవాదాలు



మోడీ, అరవింద్, కమలం పువ్వు చిత్రాలు వేసిన భవాని

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్‌కు పసుపు బోర్డు సాధించడం పట్ల ఎంపీ అర్వింద్‌కు ఓ యువతి వినూత్నంగా ధన్యవాదాలు తెలిసింది. నిజామాబాద్ నగరంలోని బోర్గాం(పి)కి చెందిన ఫోటో గ్రాఫర్ మల్లేష్ కుమార్తె చిన్నకరి భవాని కోటగల్లీలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతోంది. పసుపు బోర్డును నిజామాబాద్‌కు మంజూరు చేయించుకోవడమే కాక, జిల్లాకు చెందిన రైతు పల్లె గంగారెడ్డిని జాతీయ పసుపు బోర్డు చైర్మన్‌గా నియమించడం పట్ల ఆనందం వ్యక్తం చేసింది. స్థానిక భాజపా నాయకుడు యాదాల నరేష్ ఇంట్లో ధన్యవాదాలు తెలిపేలా ముగ్గు వేసింది. ముగ్గులో మోడీ, అరవింద్, కమలం పువ్వు చిత్రాలు గీసి వీరిద్దరిని ఇందూరు ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని పేర్కొంది. కాగా సోషల్ మీడియా ద్వారా ఈ చిత్రాన్ని చూసిన ఎంపి అర్వింద్ యువత వేసిన ముగ్గు తనని మంత్రముగ్దుల్ని చేసిందని, తమ పట్ల యువతికి ఉన్న అభిమానానికి ధన్యవాదాలు తెలియజేశారు.



జక్రాన్‌పల్లి: పల్లె గంగారెడ్డిని సన్మానించిన పలువురు



ఆర్మూర్: మాట్లాడుతున్న నాయకులు



ఏర్గట్ల: పీఎం,ఎంపీ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న బిజెపి నాయకులు



నిజామాబాద్ సిటీ :

నిజామాబాద్ సిటీ: జాతీయ పసుపు బోర్డు చైర్మన్‌ను కలిసిన ఛాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు

ప్లాస్టిక్ మాంజాతో తెగిన యువకుడి గొంతు



వైద్యం చేస్తున్న వైద్యులు


నవతెలంగాణ-నవీపేట్/మోర్తాడ్

మండల కేంద్రంలో చైనామాంజాతో సుభాష్ నగర్‌కు చెందిన అద్నాన్ (18) యువకుడి గొంతు మంగళవారం తెగింది. మండల కేంద్రంలోని స్టేషన్ ఏరియా ప్రాంతంలో ప్లాస్టిక్ మాంజాతో ఉన్న పతంగి తెగిపోవడంతో పట్టుకునేందుకు ప్రయత్నించిన అద్నాన్ మెడకు చుట్టుకుంది. మెడకు చుట్టుకొని గొంతును కత్తిరించగా తీసేందుకు చేతితో ప్రయత్నించగా కుడి చేతి వేళ్ళు సైతం తెగాయి. దీంతో స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా గొంతుకు నాలుగు, చేతి వేళ్లకు నాలుగు కుట్లు పడ్డాయి. చైనా మాంజ యువకుడి ప్రాణం మీదికి వచ్చినట్లయితే.దీనిపై బాధిత కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు.

ప్లాస్టిక్ మాంజకు ఒకరికి గాయాలు

మోర్తాడ్ : కమ్మర్‌పల్లి ఆంధ్రా బ్యాంకు వద్ద జరిగిన ప్రమాదంలో మోర్తాడ్ మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన గుజేటి ప్రవీణ్ తీవ్ర గాయాల పాలయ్యాడు. మెట్పల్లిపల్లి తిరిగి వస్తుండగా కమ్మర్‌పల్లి ఆంధ్రాబ్యాంకు వద్ద రోడ్డుపై ప్లాస్టిక్ మాంజా అడ్డుగా ఉండడంతో తన మెడకు చుట్టుకొని భారీగా తెగడంతో రక్తస్రావం అయింది. స్థానికులు ఆయన్ను ఆసుపత్రికి చదివించిన అదనపు వైద్యనిమిత్తం ఆర్మూర్ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఆర్మూర్ ఆశ ఆసుపత్రిలో ఆయనకు 12 కుట్లు వేసినట్లు తెలిపారు. ప్రభుత్వం ఎంత అవేర్నెస్ కల్పించిన ప్లాస్టిక్ మాంజ వినియోగించడంతో పలువురు గాయాల పాలవుతున్నారు.

గాలిపటాలు పంపిణీ



ఎస్ఐని సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-మోపాల్

సంక్రాంతి సందర్భంగా మంచిప్ప గ్రామంలో పిల్లలకు శుభాకాంక్షలు తెలుపుతూ మోపాల్ యువజన కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో గాలిపటాలను మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా సబ్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గాలిపటాలను ఎగర వేసేటప్పుడు జాగ్రత్త వహించాలని, కరెంటు స్తంభాలపై పడిన పతంగులు జోలికి వెళ్లకూడదని, సాధ్యమైనంతవరకు కరెంటు పోల్స్, తీగలు లేని చోట గాలిపటాలు ఎగురవేయాలని, ప్లాస్టిక్ మాంజలను వాడకూడదని, వాటి వల్ల జరిగే దుష్ప్రభావాలు గురించి పిల్లలకు వివరించారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తూర్పు రాజేష్, వెంకట్రాం, మాజీ ఉపసర్పంచ్ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ముదురుతున్న కల్లు వివాదం



- పిసిసి అధ్యక్షున్ని కలవనున్న వీడీసీ సభ్యులు
- అధికారుల అండదండలేనని అంటున్న ఓ గ్రూప్

నవతెలంగాణ-ధర్పల్లి

మండలంలోని హొన్నాజీపేట గ్రామంలోని గౌడ కులస్థుల్లో జరుగుతున్న కల్తీ కల్లు (గుల్ ఫారం) వ్యాపారంపైన గీత కార్మిక కుటుంబాల్లు రెండు గ్రూపులుగా విడిపోయాయి. మూడు దుకాణాలు పెట్టకునేందుకు, ఎవరికి వారు పోతు గ్రామానికి చెడ్డపేరు తెచ్చేవిధంగా చేస్తున్నారని, గౌడ కులస్థులు సంయమనం పాటిస్తూ గొడవలు జరగకుండా వ్యాపారం చేసుకోవాలని గ్రామభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్తులు అంటున్నారు. ఎక్కువ మోతాదులో ఆల్ప్రాజోలం కలవవద్దని చెప్పినందుకు ఓగ్రూపువారు దాన్ని రాజకీయం చేస్తూ తమపై పోలీసులకు ఫిర్యాదు చేశారాని మండిపడుతున్నారు. మంచి చెపితే తమపై ఫిర్యాదు చేస్తారా! అంటూ తాముకూడా పిసిసి అధ్యక్షుని వద్దకు వెళ్లి గ్రామంలో జరిగిన ఘటన గురించి వివరిస్తామని విడిసి సభ్యులు తెలిపారు. మరోపక్క గ్రామంలో నిర్వహిస్తున్న మూడు కల్లు దుకాణాలు ఎవరికి వారు కొనసాగిస్తుండగా అబ్కారి అధికారులు వచ్చి కేవలం తమ దుకాణాన్ని మాత్రమే సీజ్ చేసి ఇతరుల దుకాణాలు కొనసాగించడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. కేవలం రాజకీయ నాయకుల పేర్లు చెప్పి బుకాయించే కొందరి మాటలు విని తమపై కక్ష సాధింపు చర్యలకు అబ్కారి అధికారులు పూనుకున్నారని మరో గ్రూపు వ్యాపారులు వాపోతున్నారు. లైసెన్సులు ఉన్న వారు మాత్రమే కొనసాగించాలని, చట్ట ప్రకారం నడుచుకోవాలని, మెలికలు పెడుతున్న అధికారులకు మావద్ద ఉన్నవి లైసెన్సులు కావా అని కొందరు గీత కార్మికులు ప్రశ్నిస్తున్నారు. మాకో నిభందన వారికో నిభందననా? అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అసలు నిభంధనల ప్రకారం గీత కార్మికులు కల్లు చెట్ల నుండి తీసిన చోటే అమ్మకాలు జరపాలి. అలా కాకుండా గ్రామంలోని ఒక చోటికి చేర్చి అందులో అల్ప్రా జోలం అధిక మోతాదులో కలుపుతూ కొందరు ప్రజల ప్రాణాలు తీస్తున్నారని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో కొందరు ఏకమై ప్రతియేటా లక్షలు సంపాదిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. తమలాంటి ఫార్ములా ఎవ్వరి దగ్గర ఉండదు అంటూ ధర్పల్లి, సీతాయిపేట, ముషీర్ నగర్, గడ్కోల్, కొండాపూర్ గ్రామాలకు సైతం ఇక్కడి నుండే సరఫరా చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదంతా అబ్కారి అధికారుల కన్ను సన్నల్లో నడుస్తుందని పలువురు విమర్శిస్తున్నారు. గ్రామంలోని ఒక గ్రూపుకు చెందిన కల్లు దుకాణాన్ని సీజ్ చేయగా ఇతరులది ఎలా కొనసాగిస్తారని సీజ్ అయిన దుకాణదారులు అప్కారి అధికారులకు ప్రశ్నించగా మాకు తెలియదు..వస్తున్నాం అని సమాధానం ఇస్తున్నారని వాపోతున్నారు.

తీరా వారు వచ్చే సమాచారం సదరు వ్యాపారికి సమాచారం అందించి వస్తున్నారని, వారు వచ్చేలోపు వీరు జారుకుంటున్నారని, అదేంటి ఇక్కడ దుకాణం మూసి ందని తమకే ఎదురు ప్రశ్నిస్తున్నారని బాధితులు వాపోతున్నారు. మంగళవారం కూడా యధావిధిగా వారు దుకాణం తెరిచి కల్లు అమ్మకాలు జరిపారని, వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని సీజ్ అయిన దుకాణదారులు డిమాడ్ చేస్తున్నారు.

జిల్లాకు పసుపు బోర్డు రైతుల పోరాట విజయమే

- సిపిఐ(ఎం-ఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జిల్లాలో పసుపు బోర్డు ఏర్పాటు చేయడాన్ని సిపిఐ(ఎం-ఎల్) న్యూడెమోక్రసీ స్వాగతిస్తున్నదని సిపిఐ(ఎం-ఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య అన్నారు. మంగళవారం పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో రైతాంగం సుదీర్ఘ పోరాటాల ఫలితంగా పసుపు బోర్డు రావడం జరిగిందన్నారు. పసుపు బోర్డు రావడం వల్ల కొత్త కొత్త వంగడాలు, కొత్త పరిశోధనలు చేయడానికి ఉపయోగపడుతుందన్నారు. వీటితో పాటు పసుపు పండించిన రైతుకు గిట్టుబాటు ధర, పెట్టుబడికి తగ్గ ప్రతిఫలం రైతుకు దక్కినప్పుడే ఈ బోర్డు ఏర్పాటు సార్థకం అవుతుందని తెలిపారు. వ్యవసాయ రంగా అభివృద్ధికి పంటల గిట్టుబాటు ధరలకై ఎమ్మెస్పీ మద్దతు ధరల చట్టానికై పోరాడుతున్న పంజాబ్ రైతు జగదీష్ సింగ్ ఆరోగ్య పరిస్థితి రోజు రోజుకు దిగజారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ముందుగా ఆ రైతులతో చర్చలు జరిపి దీక్ష విరమణ చేసి రైతాంగ సమస్యలను పరిష్కరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పసుపు బోర్డుతో పాటు జిల్లాలో రెండు చక్కర ఫ్యాక్టరీలను తెరిపించే దాంట్లో కేంద్ర ప్రభుత్వ సహకారం బాధ్యత ఉందని తెలిపారు. ఎన్నికల్లో చెప్పిన నిజామాబాద్ ఎం.పీ రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి తెరిపించడానికి కృషి చేయాలన్నారు.

చక్కెర ఫ్యాక్టరీ తెరిపించి ప్రభుత్వమే దాన్ని బెల్లం కేంద్రంగా మార్చి నడపాలని డిమాండ్ చేశారు. దేశంలో బెల్లానికి మంచి డిమాండ్ ఉన్నందున 18 శాతం జి.ఎస్టి కూడా ఉన్ననందున రైతులకు మంచి లాభదాయకంగా ఉంటుందని తెలిపారు. ఈ ప్రాంతంలో నాలుగు శాసనసభ నియోజకవర్గాలలోని 70 గ్రామాలలో మూడు వేల ఎకరాలలో చెరుకు పండించేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా వెంటనే చెక్కర ఫ్యాక్టరీలు తెరిపించి నడిపించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు డిమాండ్ చేశారు. ఇంకా ఈ ప్రెస్‌మీట్‌లో



మాట్లాడుతున్న సిపిఐ (ఎం-ఎల్) నాయకులు

ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు వేల్పుల భూమయ్య, న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు నీలం సాయిబాబా, ఐఎఫ్‌టియు నాయకులు ఎం.శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో బంగారు పతకం

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న కే.ప్రవీణ్ జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీలో జరుగుతున్న 68వ జాతీయస్థాయి అండర్ 14, అథ్లెటిక్స్ విభాగంలో 100 మీటర్ల పరుగు పందెంలో 11.39 సెకండ్లలో పూర్తిచేసి మొదటి స్థానంలో నిలిచి, బంగారు పతకాన్ని సాధించారని కోచ్ సురేశ్ బుధవారం తెలిపారు. జాతీయ స్థాయిలో కొత్త రికార్డును నెలకొల్పాడని తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ యం శివరాం, వైస్ ప్రిన్సిపాల్ యస్ మోహన్ రెడ్డి, యం.సురేందర్ రెడ్డి, పి ఈ టి మహేష్, అధ్యాపక బృందం అభినందించారు.


బంగారు పతకం సాధించిన ప్రవీణ్

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

నవతెలంగాణ-సదాశివనగర్


గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

సదాశివనగర్ మండలం మోడేగాం గ్రామంలో బుధవారం సీసీటీవీ కెమెరాల ప్రాముఖ్యతపై స్థానిక పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో గ్రామస్తులతో మీటింగ్ ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. దీంతో గ్రామస్తులు అందరూ సీసీటివి కెమెరాల ఏర్పాటు గురించి హామీ ఇచ్చి, అడ్వాన్స్‌గా 50 వేల రూపాయలు సీసీటీవీ కెమెరా టెక్నీషియన్స్‌కి అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు అందరికీ పోలీసు శాఖ తరపున ధన్యవాదాలు తెలియజేశారు.


కామారెడ్డి: ముగ్గు వేస్తున్న చిన్నారి


నాగిరెడ్డిపేట్ : ట్రోఫీతో గెలుపొందిన క్రీడాకారులు


లింగంపేట్ : గెలుపొందిన మహిళలకు బహుమతులు అందజేత


మద్నూర్: లక్ష్మీ దీపాన్ని తీసుకెళ్తున్న రైతు

ఘనంగా సంక్రాంతి వేడుకలు

- ముగ్గులువేసి మురిసిన బాలికలు
- పతంగులు ఎగరేస్తూ చిన్నాపెద్ద సందడి
- క్రీడా పోటీలు.. బహుమతులు

నవతెలంగాణ-కామారెడ్డి

మకర సంక్రాంతి పండుగ సందర్భంగా జిల్లా కేంద్రంతో పాటు బిబిపేట మండలంలోని జనగామ గ్రామంలో చిన్నారులు, మహిళలు తమ తమ ఇండ్ల ముందు వేసిన ముగ్గులు పలువురిని ఆకర్షించాయి. కామారెడ్డి మున్సిపల్ పరిధిలో ఎంతో కష్టపడి ముగ్గులు వేసిన ఆడపడుచులను స్థానిక 47వ వార్డు కౌన్సిలర్ గెరిగంటి స్వప్న లక్ష్మినారాయణ ప్రోత్సాహించి అభినందించారు.

నాగిరెడ్డిపేట్ : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో గత మూడు రోజులుగా మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీధర్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పది జెట్లు పోటీ పడగా చివరికి రెండు జట్లు ఫైనల్‌కు చేరాయి. పోచారం వర్సెస్ జప్తి జనకంపల్లి టీంలు తలపడగా.. పోచారం గెలుపొందింది. జనకంపల్లి రన్నరప్‌గా నిలిచింది. మొదటి బహుమతిగా రూ.7777 గెలుచుకుంది. రెండో బహుమతిగా రూ.5555 అందించినట్టు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి ఏఎంసీ చైర్పర్సన్ రజిత వెంకటరామిరెడ్డి, నాగిరెడ్డిపేట మాజీ సర్పంచ్ విట్టల్ రెడ్డి గారి విటల్ రెడ్డి, మైనార్టీ అధ్యక్షుడు ఇమామ్, సీనియర్ నాయకులు నర్సింహారెడ్డి, ఫారుక్ సాబ్, కిష్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ముగ్గులు పోటీలు..

లింగంపేట్ : మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బుర్ర నారాగౌడ్ ఆధ్వర్యంలో లింగంపేట్ నాగన్న మెట్ల బావి వద్ద నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలకు ఎస్సై సుధాకర్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. సంక్రాంతి ఎర్వదినాన్ని పరిశీలించుకుని మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎల్లారెడ్డి శాసనసభ్యులు మదన్మోహన్ రావు ఆదేశానుసారం మండల స్థాయి ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన మహిళలు, యువతులు ముగ్గుల పోటీల్లో ఆసక్తితో పాల్గొన్నారు. ముగ్గుల పోటీలను న్యాయ నిర్ణేతలు పర్యవేక్షించి విజేతలను ప్రకటించారు. మొదటి బహుమతి ఐదు తులాల వెండి హేమ శ్రీ, రెండవ బహుమతి మూడు తులాల వెండి ఆకుల.నవ్య, మూడవ బహుమతి రెండు తులాల వెండి మౌనిక, నాలుగో బహుమతి రైస్ కుక్కర్ శ్రీ బ్రాహ్మణి, ఐదవ బహుమతి ప్రెషర్ కుక్కర్ సుప్రియ, ముగ్గుల పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి టిఫిన్ బాక్స్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బుర్ర నారా గౌడ్ మండల సమన్వయ కమిటీ సభ్యులు మంజరి ఎల్లమ్మయ్య మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ డాక్టర్ జొన్నల రాజు, దిశ కమిటీ సభ్యులు రాజు దేశముఖ్ ప్రసాద్‌గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ దశరథ్, తదితరులు పాల్గొన్నారు.

మద్నూర్: మద్నూర్, డోంగ్లి మండలాల ప్రజలు భోగి, సంక్రాంతి, కనుమ ఉత్సాహంగా ఘనంగా నిర్వహించుకున్నారు. సంక్రాంతి రోజున ప్రజలు తమ తమ చేనుల్లోకి వెళ్లి జొన్న పంటకు ప్రత్యేకంగా పూజలు చేసి జొన్న చేనుల్లో వెలిగించిన దీపాన్ని లక్ష్మి దీపంగా భావిస్తూ ఇండ్లకు తీసుకువచ్చారు. సంక్రాంతి సంబరాల్లో ప్రజా ప్రతినిధులు, అధికారులు బంధుమిత్రులు పాల్గొన్నారు.

భిక్కనూర్ : మండలంలో సంక్రాంతి సంబరాలను మండల ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు పిండి వంటలు, వాకిట్లో రంగోలి ముగ్గులు వేశారు. యువకులు గాలిపటాలను ఎగరవేసి ఆనందంతో సంక్రాంతి సంబరాలు నిర్వహించుకున్నారు.

గాంధారి : గాంధారి మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో వివిధ తండాల్లో సంక్రాంతి పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. మహిళలు వారి ఇళ్ళ ముందు ముగ్గులతో అలంకరించారు. యువకులు పతంగులకుతో కోలహాలం చేశారు.

గాలిపటాల వితరణ..

సదాశివనగర్ : సంక్రాంతి సందర్భంగా అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామంలో బుధవారం యూత్ ఆధ్వర్యంలో గాలిపటాల వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో మాలిక్, షకీల్ , ఫిరోజ్ హాజీ, మోసిన్, శంకర్ , యూత్ సభ్యులు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

రంగవల్లులతో అల్లుకున్న గ్రామాలు

రామారెడ్డి : మండలంలోని ఆయా గ్రామాల్లో మంగళవారం సంక్రాంతి పర్వదినన్ని పురస్కరించుకొని మహిళలు రంగురంగులతో వేసిన ముగ్గులు కనువిందు చేశాయి. యువత ఆటలతోపాటు గాలిపటాలు ఎగరవేస్తూ ఆనందోత్సవాల మధ్య గడిపారు. రామారెడ్డితో పాటు పోసానిపేట్, గొల్లపల్లి గ్రామాల్లో క్రికెట్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

సంక్రాంతి సంబరాలలో కబడ్డీ పోటీలు

భిక్కనూర్ : సంక్రాంతి సందర్భంగా భిక్కనూరు పట్టణంతో పాటు జంగంపల్లి ఆయా గ్రామాలలో కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ కేంద్రంలో రైజింగ్ స్టార్ ఆర్గనైజేషన్, జంగంపల్లి గ్రామంలో స్వర్గీయ అత్తెల్లి కిష్టయ్య జ్ఞాపకార్థం నిర్వహించిన కబడ్డీ పోటీలలో గెలిచిన వారికి బహుమతులు అందజేసి యువకులు చదువుతోపాటు కలిసిమెలిసి గ్రామ అభివృద్ధికి, క్రీడా రంగాలలో రాణించాలని ప్రజాప్రతినిధులు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు శ్రీనివాస్, మోహన్ రెడ్డి, వేణు, రమేష్, రవీందర్, పోటీలో గెలుపొందిన యువకులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేత

నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండలంలోని జువ్వాడి గ్రామంలో జువ్వాడి ప్రీమియం లీగ్ క్రికెట్ మ్యాచ్ నిర్వహించారు. గెలుపొందిన క్రీడాకారులకు కాంగ్రెస్ నాయకులు వెంకటరెడ్డి, ఎల్లారెడ్డి సివిల్ సప్లైస్ డిప్యూటీ తహశీల్దార్ బాలయ్య బహుమతులు అందజేశారు. ఈ క్రీడలో అంజల్ రెడ్డి అండ్ టీం విన్నర్స్‌గా మహేందర్ అండ్ టీం రన్నర్స్‌గా విజయం సాధించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు శ్రీకాంత్, కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు సంతోష్, సాయిలు పాల్గొన్నారు, ఈ కార్యక్రమంలో మండల యూత్ ఉపాధ్యక్షులు వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకోవాలి


క్రీడాకారులతో తూర్పు రాజు

నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండలంలోని తిప్పారం గ్రామంలో స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని తిప్పారం గ్రామంలో నిర్వహించిన క్రీడా పోటీలు ముగిసాయిముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గాంధారి మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు తూర్పు రాజు విచ్చేసి గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వామి వివేకానంద స్ఫూర్తి ఆయన అడుగు జాడల్లో యువత నడవాలని గ్రామాల్లో యువత మంచి స్వేచ్ఛ వాతావరణంతో కలిసిమెలిసి ఉండాలన్నారు. కార్యక్రమంలో గాంధారి మండలం ఏఎంసి డైరెక్టర్లు ఎస్కే అబ్బు, కాయితి సాయిలు, మండల సీనియర్ నాయకులు కాయితి రవి, గుర్రం భూమేష్, తిప్పారం గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గిరిజన జాతర



నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండలం లోని చర్మల్ తండలో శ్రీ లక్ష్మమ్మ దేవి జాతరను ఘనంగా నిర్వహించారు. ప్రజలు ముఖ్యంగా గిరిజనులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ జాతరను దాదాపుగా 20 సంవత్సరాలుగా నిర్వహిస్తున్నారు. అమ్మ వారిని పూజ, హెూమము నిర్వహించి నైవేద్యం సమర్పించారు. తరతరాలుగా వస్తున్న సాంప్రదాయాల ప్రకారం జాతరను నిర్వహించారు. భక్తులు దాదాపుగా 20 వేల వరకు ప్రజలు పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా రాంసింగ్, మహారాజ్, మోతిలాల్ మహారాజ్ జిల్లా నలుమూలల నుంచి ప్రజలు ముఖ్యంగా గిరిజనులు తాండోపతండాలుగా పాల్గొన్నారు.

కళాకారులను ఆదుకుందాం

నవతెలంగాణ-రామారెడ్డి

సాంప్రదాయాలకు, ప్రాచీన కలలకు తెలుగు రాష్ట్రాలు పెట్టింది పేరు అని, అలాంటి కళలను, కళాకారులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్ లీడర్ నా రెడ్డి మోహన్ రెడ్డి అన్నారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం బసవన్నతో, కళాకారులతో గడిపారు. ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. నా రెడ్డి స్వచ్ఛంద సంస్థ ద్వారా కళాకారులకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

వ్యాక్సినేషన్ టీకాల గడువు చూసుకోవాలి

- హెచ్ఈఓ వెంకటరమణ

నవతెలంగాణ-భిక్కనూర్

వ్యాక్సినేషన్ టీకాల గడువును ఎప్పటికప్పుడు చూసుకోవాలని హెచ్ఈఓ వెంకటరమణ ఆరోగ్య సిబ్బందికి సూచించారు. బుధవారం మండలంలోని ప్రాథమిక ఆరోగ్య సబ్ సెంటర్‌లను పరిశీలించారు. రొటీన్ ఇమ్యునైజేషన్ ప్రక్రియ, టీకాలు, చిన్నారులకు అందిస్తున్న టీకాల వివరాలు, రికార్డులు పరిశీలించారు. అనంతరం చిన్నారుల ఆరోగ్య వివరాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు తల్లులకు సూచించాలని తెలియజేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం, ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు, తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

- ఎదురెదురుగా వచ్చి ఢీకొన్న బైక్‌లు..

పండుగ పూట విషాదం

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ మండలంలోని సోనాల రోడ్డులో బుధవారం రెండు బైకులు ఎదురెదురుగా ఢీ కొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందినట్లు ఎస్సై విజయ్ కొండ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం రెండు బైకులు ఎదురుగా ఢీకొట్టడంతో మద్నూర్ మండలంలోని గోజేగావ్ గ్రామానికి చెందిన లక్ష్మణ్ దేశాయ్ (39) మృతి చెందినట్లు తెలిపారు. లక్ష్మణ్ దేశాయి మృతితో కనుమ పండుగ పూట గోజేగావ్ గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై విజయ్ కొండ తెలిపారు.

గెలుపోటములు సహజం

నవతెలంగాణ-తాడ్వాయి

క్రీడల్లో గెలుపోటములు సహజమేనని మండల మాజీ ఉపాధ్యక్షులు ఎం నర్సింలు అన్నారు. బుధవారం జిల్లా పరిష పాఠశాల ఆవరణలో జరిగిన కబడ్డీ ప్రీమియర్ లీగ్ పోటీల కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ఓటమి చెందిన క్రీడాకారులు క్రీడా నైపుణ్యాన్ని పెంచుకొని ముందుకు సాగాలని అన్నారు. క్రీడల్లో భవిష్యత్తు ఉంటుందని నిత్యం క్రీడా స్ఫూర్తి పెంచుకోవాలని దీనితో స్నేహభావం పెరుగుతోందన్నారు. ఈ క్రీడలు దాస కిష్టయ్య స్మారకార్థం తో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అంబీర్ శ్యామ్ రావు, ప్రధానోపాధ్యాయులు డి సంగారెడ్డి, స్థానిక ఉపాధ్యాయులు ఆర్ రాజా గౌడ్, కాంగ్రెస్ గ్రామయూత్ అధ్యక్షులు గుట్టకాడి రంజిత్ రెడ్డి ల సహకారంతో పోటీ లు నిర్వహించామన్నారు. గెలుపొందిన జట్లకు బహుమతులు అందజేశారు. న్యాయ నిర్ణయితలుగా, ఎస్ నగేష్, స్వామి గౌడ్ వ్యవహరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బండారు సంజీవ్, దాస కిషన్, నేతాజీ యూత్ అధ్యక్షులు, పంబల్ల సతీష్, సీనియర్ కిరాకారులు ఎం నర్సింలు, పి జగదీశ్వర్ అహ్మద్ హుస్సేన్, జి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆమరణ నిరాహార దీక్ష విరమించిన రైతు



నవతెలంగాణ-కామారెడ్డి

మాస్టర్ ప్లాన్‌లోని ఇండస్ట్రియల్, గ్రీన్ జోన్‌లను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ కామారెడ్డి జిల్లా కేంద్రంలోని మున్సిపల్ ఎదుట రైతు శ్రీకాంత్ రెడ్డి చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షను మూడో రోజు బుధవారం విరమించారు. ఈ సందర్భంగా రైతు శ్రీకాంత్ రెడ్డికి రైతులు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింప చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఈనెల 19 న అడ్లూర్ ఎల్లారెడ్డి లో రైతు కార్యచరణ కమిటీ 8 గ్రామాల రైతులం సమావేశమై మొదటగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు, కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణ రెడ్డిలను కలిసి జీవో రద్దు చేయాలని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి, రద్దు చేసిన జీవో కాపీనీ తమకు అందజేయాలని కోరనున్నట్లు రైతులు తెలిపారు. వినతి పత్రాలు ఇచ్చినా వారు స్పందించకపోతే రోజుకో గ్రామంలో సమావేశం నిర్వహించి భవిష్యత్ కార్యాచరణను ప్రకటించనున్నట్లు రైతులు పేర్కొన్నారు.

మాయావతి జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా బాహుజన్ సమాజ్ పార్టీ కార్యాలయంలో బీఎస్పీ జాతీయ నాయకురాలు, ఉత్తర్ ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి మాయావతి జన్మదిన వేడుకలను కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఆమె జన్మదిన ని పురస్కరించుకొని కామారెడ్డి జిల్లా ప్రభుత్వ హాస్పిటల్ లో రోగులకు పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు హరిలాల్ నాయక్ మాట్లాడుతూ ప్రస్తుతం రాజకీయ నాయకులు అమ్ముడుపోయే విధానానికి వ్యతిరేకంగా సమాజనికి ప్రత్యామ్నాయంగా ఆత్మ గౌరవ సమాజాన్ని నిర్మించడం కోసం , తరాలుగా పాలితులుగా ఉన్న బహుజన సమాజాన్ని పాలకులుగా మార్చడం కోసం, అహర్నిశలు మాయావతి పనిచేస్తున్నారన్నారు. ఈ కార్రయమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపల సురేష్, జిల్లా ఈసీ మెంబర్ బిమరి భాస్కర్, జుక్కల్ అసెంబ్లీ అధ్యక్షులు రోహిదాస్, కామారెడ్డి అసెంబ్లీ ఉపాధ్యక్షులు జీవన్, సోషల్ మీడియా కన్వీనర్ బాబు , ఎల్లారెడ్డి పట్టణ కమిటీ అధ్యక్షుడు మార్లు సాయిబాబు, కామారెడ్డి మండల అధ్యక్షులు దుబ్బాక నవీన్, పిట్లం మండల అధ్యక్షులు రాములు,తదితరులు పాల్గొన్నారు.

రెడ్డిపేట్‌లో జాతీయ సైనిక దినోత్సవం

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని రెడ్డిపేట్‌లో బుధవారం జాతీయ సైనిక దినోత్సవాన్ని గ్రామస్తుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా యువతకు 1600 మీటర్ల పరుగు పందాన్ని నిర్వహించారు. వ్యాయామ ఉపాధ్యాయులు సాయి మౌర్య మాట్లాడుతూ... గ్రామం నుండి దేశసేవ చేయడానికి ఒక సైనికుడు కూడా లేకపోవడాన్ని గమనించిన పోలీస్ శాఖలో పనిచేస్తున్న గ్రామానికి చెందిన లక్కాకుల భరత్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షులు నర్సింలు, యువతా తదితరులు పాల్గొన్నారు.

పథకాల అమలుకు సర్వే చేపట్టాలి

- సిబ్బందికి శిక్షణ ఇచ్చిన అధికారులు
- సర్వేపై సలహాలు సూచనలు అందజేత

నవతెలంగాణ-తాడ్వాయి/గాంధారి/బీబీపేట్/కామారెడ్డి

ఇందిరమ్మ ఆత్మీయ రైతు భరోసా రేషన్ కార్డు, పథకాలకు ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న కుటుంబాల సర్వే చేపట్టాలని ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు, అంగన్వాడి, ఆశా, వ్యవసాయ శాఖ అధికారులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. పట్టాదారులు భూముల్లో ఎలాంటి పంటలు తీస్తున్నారో పంట భూముల సాగు విషయాలపై రైతు కుటుంబాల వద్దకు వెళ్లి పట్టాదారు పాసుపుస్తకాలు పరిశీలించి నమోదు చేయాలని, రేషన్ కార్డులకు అర్హులా కాదా సమాచారం సేకరించి నమోదు చేయాలన్నారు. గతంలో ఉన్న కార్డులో మార్పులు చేర్పులు ఉన్నప్పటికీ నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ సర్వే ఈనెల 16 నుండి 20 వరకు పూర్తిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ రహీముద్దీన్ వ్యవసాయ శాఖ అధికారి నర్సింలు. మండల పంచాయతీ అధికారిని సవితా రెడ్డి , పంచాయతీ కార్యదర్శులు అంగన్వాడి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


తాడ్వాయిలో సిబ్బందికి శిక్షణ ఇస్తున్న అధికారులు

పథకాల అమలుపై సమీక్ష

గాంధారి : గాంధారి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల సర్వే అంశాల పై, అదే విధంగా 21వ తేదీ నుంచి 24 వరకు గ్రామసభలు నిర్వహించపై సమీక్షిం చారు. అలాగే రైతు భరోసా తదితర అంశాలపై మండల స్థాయి అధికారులు పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ సతీష్ రెడ్డి, ఎంపిడిఓ రాజేశ్వర్, డి.యల్.పి.ఓ ఎల్లారెడ్డి సురేందర్ , యం.పి.ఓ లక్ష్మి నారాయణ, యం.ఆర్.ఓ సతీష్ రెడ్డి, డిప్యూటీ తాసిల్దార్ రవి కుమార్, ఏవో రాజలింగం పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

బిబిపేట్(కామారెడ్డి) : కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, ఆత్మీయ రైతు భరోసా పథకాల దరఖాస్తుల పరిశీలనపై పంచాయితీ కార్యదర్శులకు, ఫీల్డ్ అసిస్టెంట్లకు మండలాధికారులు శిక్షణ ఇచ్చారు. బిబిపేట్ మండలంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి పూర్ణ చంద్రోదయ కుమార్, కార్యదర్శులు రమేష్, అనిల్, మంజు, వెన్నెల, శ్రీనివాస్, రాజశేఖర్, కాశీ కళ్యాణ్, వెంకటస్వామి, భరత్, నరేందర్ లతోపాటు ఫీల్డ్ అసిస్టెంట్లు కృపాల్ రెడ్డి, రాజయ్య, నారాయణరెడ్డి, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేట్ : ప్రభుత్వ పథకాల అమలు పరిశీలనపై బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు ఆశా వర్కర్లకు ఎంపీడీవో ప్రభాకర్ చారి తాసిల్దార్ శ్రీనివాసరావు అవగాహన కల్పించారు. కొత్త రేషన్ కార్డుల ప్రక్రియ అదే విధంగా ఇందిరమ్మ ఆత్మీయ రైతు భరోసా పథకాల దరఖాస్తుల పరిశీలన పై పలు సలహాలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పలు గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఓటమి గెలుపునకు నాంది

- మాజీ సర్పంచ్ బండారి సంజీవ్

నవతెలంగాణ-తాడ్వాయి

ఓటమి గెలుపునకు నాంది అని మాజీ సర్పంచ్ బండారి సంజీవ్ అన్నారు. మంగళవారం నిర్వహించిన ప్రీమియర్ లీగ్ పోటీల ముగింపు కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ఓటమి చెందిన క్రీడాకారులు నిరుత్సాహపడకుండా క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. యువత నిత్యం క్రీడలకు సమయం కేటాయించి నైపుణ్యాన్ని పెంచుకోవాలని తెలిపారు. క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదిగి కీర్తి ప్రతిష్టలు పొందాలన్నారు. గ్రామానికి చెందిన ఉపాధ్యాయులు రామ గోనేలా రాజాగౌడ్ రూ.18వేల ప్రైజ్ మనీ అందించారని, మెట్టు చిన్నస్వామి జ్ఞాపకార్థం పోటీలు నిర్వహించినట్టు తెలిపారు. 8 జట్లు పాల్గొనగా విక్టరీ యాంకర్ జట్టు ప్రథమ స్థానంలో నిలవగా, సూపర్ స్ట్రైకర్స్ ద్వితీయ స్థానంలో నిలిచారు. జట్లకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ మండల పరిషత్ ఉపాధ్యక్షులు ముదాం నర్సింలు, సిడిసి మాజీ చైర్మన్ మద్ది మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జంగం రాజు, ఉపాధ్యాయులు ఆర్.రాజాగౌడ్, నేతాజీ యూత్ అధ్యక్షులు పంబల్ల సతీష్, క్రీడాకారులు గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.


ట్రోఫీని అందుకుంటున్న విక్టరీ యాంకర్ జట్టు

ప్రభుత్వ ఉద్యోగం సాధించిన యువతకు సన్మానం

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని జంగంపల్లి గ్రామంలో మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో గ్రామం నుంచి ప్రభుత్వ ఉద్యోగం సాధించిన యువతకు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు స్వామి మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన హరివినోద, గౌతమి ప్రభుత్వ ఉద్యోగం సాధించడం పట్ల అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.


ఉద్యోగం సాధించిన యువతను సన్మానించిన పలువురు

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-తాడ్వాయి

మండలంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో చేరేందుకు 2025-26 సంవత్సరానికి గాను దరఖాస్తులు చేసుకోవాలంటూ మండల కేంద్రంలోని ప్రధాన వీధుల గుండా పోస్టర్లతో పాఠశాల సిబ్బంది బుధవారం ప్రచారం చేశారు. 5వ తరగతి నుంచి 9వ తరగతిలో చేరెందుకు అర్హులైన బాలికలు అవసరమైన ధ్రువపత్రాలతో ఫిబ్రవరి ఒకటవ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. ఫిబ్రవరి 23న ఉమ్మడి ప్రవేశ పరీక్ష ఉంటుందని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పోస్టర్లలో పేర్కొన్నారు.

ద్విచక్ర వాహనం దగ్ధం

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని పెద్ద మల్లారెడ్డి గ్రామంలో గుర్తు తెలియని దుండగులు సోమవారం రాత్రి గ్రామానికి చెందిన బాలరాజు ద్విచక్ర వాహనాన్ని దగ్ధం చేశారు. స్థానికులు గమనించి మంటలు ఆర్పె ప్రయత్నం చేసిన అప్పటికే ద్విచక్ర వాహనం పూర్తిగా దగ్ధమైంది. ద్విచక్ర వాహనానికి నిప్పంటించిన దుండగులను పట్టుకొని న్యాయం చేయాలని బాధితుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు సమాచారం.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

నవతెలంగాణ-భిక్కనూర్

పట్టణంలోని ప్రముఖ వ్యాపారవేత్త, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ పురం రాజమౌళి వృద్ధులకు దుప్పట్లు బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పట్టణవాసులు, వృద్ధులు, తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రపల్లిలో కబడ్డీ పోటీలు



నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని రామచంద్రపల్లి గ్రామంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా ప్రాథమిక పాఠశాలలో కబడ్డీ పోటీలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పిల్లలకు శివాజీ, టైగర్స్, బజరంగ్ బలి టీమ్‌లకు కబడ్డీ పోటీలు నిర్వహించారు. దీంట్లో బజరంగబలి టీం విజయం సాధించింది. విజేతలకు బహుమతుల ప్రధానోత్సవం జనవరి 26 న గణతంత్రదినోత్సవం సందర్భంగా ఇవ్వనున్నట్లు స్థానికులు తెలిపారు. గ్రామస్తులు ఉల్లాసంగా, ఉత్సాహంగా కబడ్డీ పోటిల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

ఉప్లూర్‌లో పతంగుల పోటీలు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని ఉప్లూర్‌లో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని గ్రామానికి చెందిన విభూది మారుతి మంగళవారం పతంగుల పోటీలను నిర్వహించారు. పెద్ద ఎత్తున యువకులు ఉత్సాహంగా ఈ పోటీల్లో పాల్గొని రంగురంగులతో వివిధ ఆకృతుల్లో ఉన్న పతంగులను ఎగురవేశారు. ఎక్కువ ఎత్తుకు, ఎక్కువ సమయం పతంగులను ఎగురవేసిన వారిని విజేతలుగా నిర్ణయించి బహుమతులను అందజేశారు. ఈ పోటీల్లో చిట్యాల ఉపేంద్ర మొదటి బహుమతి గెలుపొందగా కప్పుతోపాటు మెడల్‌ను అందించారు. రెండవ బహుమతిని పెంట అక్షయ్, పెంట వంశీ, మహేష్ మెడల్స్ గెలుపొందారు. విజేతలుగా నిలిచిన వీరికి ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన స్థానిక సీనియర్ వాలీబాల్ క్రీడాకారుడు మధు చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో నరేందర్, భాను, రోషన్, యువకులు, తదితరులు పాల్గొన్నారు.


కమ్మర్‌పల్లి: అయ్యప్ప ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు


ఆర్మూర్‌లో..


పోతంగల్: ఇంటి ముందు ముగ్గు వేస్తున్న మహిళలు


ఎడపల్లి: ముగ్గు వేస్తున్న చిన్నారులు

ఊరువాడ సంక్రాంతి సంబరాలు

- గాలిపటాలు ఎగురవేస్తూ పోటీపడ్డ యువకులు
- రంగుల ముగ్గులతో నిండిన వాకిళ్లు

నవతెలంగాణ-విలేకరుల బృందం

సంక్రాంతి సంబరాలను మూడు రోజులపాటు నిజామాబాద్‌జిల్లా ప్రజలు ఘనంగా చేసుకున్నారు. చిన్నారులకు భోగిపండ్లుపోశారు. ప్రత్యేకమైన పిండివంటలు చేసి ఆరగించారు. రంగురంగుల ముగ్గులతో వాకిళ్లు హరివిల్లులుగా మారాయి. యువకులు పోటాపోటీగా గాలిపటాలు ఎగురవేశారు. పలుచోట్ల గాలిపటాలు, ముగ్గుల పోటీలు, క్రీడాపోటీలు నిర్వహించారు.

కమ్మర్‌పల్లి : మండలంలోని ఆయా గ్రామాల్లో మకర సంక్రాంతి, కనుమ పండుగ వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు సంక్రాంతి పండుగను పురస్కరించుకొని రకరకాల పిండి వంటలతో ఇండ్లలో సందడి నెలకొంది. చిన్నారులు పతంగులు ఎగురవేస్తూ సంతోషంతో సందడి చేశారు. మండలంలోని ఉప్లూర్ రుషికొండ అయ్యప్ప క్షేత్రంలో సంక్రాంతి పర్వదినం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. మంగళవారం అయ్యప్ప ఆలయంలో అలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామికి పల్లకి సేవ, పుష్పాభిషేకం, నెయ్యాభిషేకం కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మహా మంగళహారతి, అఖండ జ్యోతి దివ్య దర్శనం కార్యక్రమాల సమయంలో భక్తుల అయ్యప్ప నామ స్మరణతో రిషికొండ అయ్యప్ప క్షేత్రం మార్మోగింది. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

బోధన్: తెలుగింటి ఆడపడుచులు ఎంతో ఘనంగా నిర్వహించే సంక్రాంతి పండగను బోధన్, సాలూర మండలంలో ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. సోమవారం భోగి, మంగళవారం సంక్రాంతి, బుధవారం కరీ పండుగను జరుపుకున్నారు. ఈ సంధర్భంగ రైతులు సాంప్రదాయంలో భాగంగా పంట పొలాలకు వెళ్లి పంటలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బంధు, మిత్రులతో పిండి వంటలు ఆరగించి ఒకరికొకరు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

రెంజల్ : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మంగళవారం మండలంలో ఒకరిపై ఒకరు పోటీపడుతూ ముగ్గులు వేశారు. సంక్రాంతి పండుగ కావడంతో కల్లాపి చల్లి ఇంటి ముందర రంగురంగుల ముగ్గులను వేయడంలో మహిళలు, యవతులు నిమగ్నమయ్యారు. ప్రతి ఇంటి ముందు ముగ్గులు వేసి ఆవు పేడ, రేగిపళ్ళతో గొబ్బెమ్మలు పెట్టారు.

నిజామాబాద్ సిటీ : సంక్రాంతి పండుగ సందర్భంగా జిల్లా కేంద్రంలోని కోటగల్లి, దుబ్బ, నాందేవాడ, గంగాస్తాన్, వినాయక్ నగర్ వంటి ప్రాంతాలలో యువకులు డబాల పైకెక్కి స్పీకర్‌లు ఏర్పాటు చేసి పాటలు వింటు, కేరింతలు కొడుతూ ఆనందోత్సవాలతో గాలిపటాలను ఎగరవేశారు. అంతేకాకుండా ఇంటి ముందు రంగు వల్లిలు రంగులు అద్దాలు, చిన్నపిల్లలకు భోగిపళ్ళను పోసి పండగ నిర్వహించారు.

జేసిఐ ఆద్వర్యంలో..

కంఠేశ్వర్ : జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ ఇందూర్, జేసిఐ అలుమ్ని క్లబ్ ఆద్వర్యంలో నగరంలోని ఇంద్రాపూర్‌లో సంక్రాంతి సంబరాలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు గాలిపటాలు పంపిణీ చేశారు. మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జేసిఐ ఇందూర్ అధ్యక్షురాలు పెందోటి గౌతమి, కార్యదర్శి కె.జైపాల్, ప్రోగ్రామ్ చైర్మెన్ కోడూరు శ్రీనివాస్, జోన్ ఆఫీసర్ నయన్, జేఏసి ఉపాధ్యక్షులు జిల్కర్ విజయానంద్, పూర్వాధ్యక్షులు విజయానంద్, వీరబ్రహ్మం, పి.చంద్రశేఖర్, గంగాదాస్, లావణ్య మనోజ్, పాల్గొన్నారు.

విశాఖ కాలనీలో..

ఆర్మూర్ : మున్సిపల్ పరిధిలోని విశాఖ నగర్‌లో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మహిళలు రంగవల్లిక ముగ్గుల పోటీలు మంగళవారం నిర్వహించినారు. కాలనీలోని మహిళలు పెద్ద ఎత్తున హాజరై ముగ్గుల పోటీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశాఖ నగర్ అభివద్ధి కమిటీ అధ్యక్షులు రాస శ్రీనివాస్ మాట్లాడుతూ.. మన సంస్కతి సాంప్రదాయాలను ప్రతిబించే పండుగలను మనమందరం ఆనందంగా జరుపుకోవాలని తెలిపారు. ఈ ముగ్గుల పోటీలో ప్రథమ బహుమతి మట్ట వనిత, ద్వితీయ బహుమతిని పొలగాని లక్ష్మి తతీయ బహుమతిని దొంద స్వర్ణలత గెలుచుకున్నారు. మిగతా వారికి ప్రోత్సాహక బహుమతులు అందించడం జరిగినది. కార్యక్రమంలో కార్యదర్శి లింబాద్రి, పొద్దుటూరి సురేందర్ రెడ్డి, దొంద రాములు, గట్టు లింబాద్రి, నర్సింగరావు, మట్ట రాజేందర్, రాజ లింగం, జగదీశ్వర్, శ్యామ్, రాజేశ్వర్ గౌడ్, కాలనీ సభ్యులు పాల్గొన్నారు.

పోతంగల్ : మండల కేంద్రంలోని అన్ని గ్రామాలలో మకర, కనుమ సంక్రాంతి సంబరాలు మంగళవారం, బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఇంటివాకిళ్లు రకరకాల రంగురంగుల ముగ్గులతో కిక్కిరిసినాయి. మహిళలు పోటీలుపడి ముగ్గులు వేశారు. కనుమ సందర్భంగా బుధవారం ఎక్కడ చూసినా, పశువులను పూజించి, మంజీరా నదిలో ఉన్న హనుమాన్ మందిరం వద్ద వ్యవసాయదారులు, గ్రామపెద్దలు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భోజన ప్రియులు, మందు ప్రియులు కరి(కనుమ) సందర్భంగా, మటన్, చికెన్, చేపల, వైన్స్‌లలో బారులు తీశారు.

పోతంగల్ : మండలంలోని హంగార్గలో గ్రామంలో సంక్రాతి, కనుమ సందర్భంగా మంజీరా నదిలో గంగమ్మ గుడి వద్ద, పశువుల పండుగను బుధవారం నిర్వహించారు. గ్రామ పెద్దలు ప్రకాష్ పటేల్, శివరాయ పటేల్, మాజీ సర్పంచ్ గంగాధర్, దొంతుల తులసిరామ్, కంచం హనుమండ్లు, భజన మండలి సభ్యులు, ప్రజలు, పాల్గొన్నారు.

కమ్మర్ పల్లిలో ముగ్గుల పోటీలు

కమ్మర్‌పల్లి : మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం ఆవరణలో స్థానిక గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో సంక్రాంతి ఉత్సవంలో భాగంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీలలో భాగంగా అందమైన రంగురంగుల ముగ్గులు వేశారు.మహిళలు వేసిన ముగ్గుల్ని పరిశీలించి న్యాయ నిర్ణయితలు విజేతలను ప్రకటించారు. ముగ్గుల పోటీల్లో మొదటి బహుమతి ఇందూర్ సింధు, ద్వితీయ బహుమతి బిందు గెలుపొందారు.విజేతలకు గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు భోగ రామస్వామి చేతుల మీదుగా బహుమతులను అందజేశారు.కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ కోశాధికారి బుచ్చి మల్లయ్య, సలహాదారులు గంగాధర్, సభ్యులు భూమన్న, సున్నం మోహన్, కొత్తపల్లి గణేష్, తదితరులు పాల్గొన్నారు.

రెంజల్ : మండలంలోని నీల గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మండల మాజీ వైస్ చైర్మన్ ఖ్యాతం యోగేష్ మంగళవారం చిన్నారులకు పతంగులను అందజేశారు. సంక్రాంతి పండగ రోజు ఆనందంగా గాలిపటాలని ఎగరవేయాలని, ప్లాస్టిక్ మాంజా లేకుండా సాధారణమైన దారాలతో ఎగుర వేసుకోవాలని ఆయన చిన్నారులకు సూచించారు. పండుగ రోజున చిన్నారులు ఆటపాటలతో అలరించాలన్న ఉద్దేశంతో ప్రతి ఏటా వారికి పతంగులను పంపిణీ చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆయనతో పాటు యువత బండారి రవి, అరవింద్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఎడపల్లిలో రంగోలి పోటీలు

ఎడపల్లి : మహిళ, యువత చిరు వ్యాపార రంగాల్లోనే గాక చిరు ఉద్యోగాల్లో రాణిస్తూ,(రంగోలి) ముగ్గుల పోటీలలో తమ నైపుణ్యాన్ని కనబడచడం హర్షనీయమని, బాలికలు క్రీడలు, రంగోలి పోటీల్లో మరింత రాణిస్తూ మండలానికి మంచి పేరు తీసుకురావాలని మాజీ ఉపాధ్యక్షురాలు రజిత ఎల్ల యాదవ్ ఆకాంక్షించారు. మకర సంక్రాంతి పండగ శుభ సందర్భంగా సోమవారం మండల కేంద్రంలోని ఐకెపి కార్యాలయ ఆవరణంలో జిల్లా పరిషత్ ఉపాధ్యక్షురాలు రజిత ఎల్లయ్య యాదవ్ ఆధ్వర్యంలో రంగోలి పోటీల నిర్వహించారు. ఈ పోటీల్లో స్వయం సహాయక సంఘాల మహిళలతో పాటు, స్థానిక మహిళలు, పాఠశాల, కళాశాల లో చదువుకుంటున్న బాలికలు రంగోలి పోటీలో పాల్గొన్నారు. మహిళలు చిన్నారులు వేసిన ముగ్గుల పోటీలు పలువురిని ఆకట్టుకున్నాయి. ప్రథమ, ద్వితీయ,,తృతీయ, బహుమతులను గెలుచుకున్న మహిళలు, బాలికలకు, ముగ్గుల పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి కన్సోలేషన్ బహుమతులను తాజా మాజీ ప్రజా ప్రతినిధులు అందజేశారు. కార్యక్రమంలో ఎల్లయ్య యాదవ్, జైతాపూర్ సహకార సంఘం అధ్యక్షులు, బోధన్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరటూరి సత్యనారాయణ, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు ఈరంటీ లింగం, తానాకలాన్ మాజీ సర్పంచ్ పాల్దా భాస్కర్ రెడ్డి, గ్రామ కాంగ్రెస్ పార్టీ గౌరవ అధ్యక్షులు బంజ కామప్ప, ఐరెండ్ల నవీన్, రత్నాకర్ రెడ్డి, ఐకెపి వివో ఏ లత, ఐకెపి మహిళా సిబ్బంది పాల్గొన్నారు.

మండలంలోని ఆయా గ్రామాల్లో మహిళలు, యువకులు, బాలబాలికలు మకర సంక్రాంతి పండగ పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. సంక్రాంతి పండగ సందర్భంగా పిండి వంటలను చేశారు. కనుమ రోజున మాంసాహారం వండుకున్నారు. యువకులు, బాలురు గాలిపటాలను ఎగరవేశారు. మహిళలు, బాలికలు తమ వాకిళ్ళ మందర రంగురంగుల ముగ్గులతో అందంగా అలంకరించారు.

గ్రామీణ మహిళ ప్రతిబింబం ఉట్టిపడేలా..

అర్మూర్ : సంక్రాంతి, కనుమ పండగల పర్వదినాన్ని పురస్కరించుకొని మహిళలు తమ ఇంటి ముంగిళ్లలో వేసిన ముగ్గులు అలరించాయి. పట్టణంలోని బ్రాహ్మణపల్లి శివారుఆల్ ఫోర్స్ నరేంద్ర పాఠశాల యందు ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న ప్రజ్ఞ రోమా వంశీ వారి ఇంటి ముందు గ్రామీణ మహిళ ప్రతిబింబం ఉట్టిపడేలా ముగ్గు వేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు అభినందనలు తెలిపారు.

సంక్రాంతి వేడుకల్లో ఎమ్మెల్సీ కవిత

కంఠేశ్వర్ : తన నివాసంలో కుటుంబ సభ్యుల మధ్య సంక్రాంతి సంబరాలను ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సంక్రాంతి పండుగను సాంప్రదాయం ఉట్టిపడేలా జరుపుకున్నారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో ముగ్గులు వేసి రంగులతో అలంకరించారు.ఎమ్మెల్సీ కవిత స్వయంగా ముగ్గులు వేసి సంక్రాంతి వేడుకల్లో పాలుపంచుకున్నారు. రాష్ట్ర ప్రజలు, రైతాంగం పాడిపంటలు, సిరి సంపదలు, సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు.


నిజామాబాద్ సిటీ: పతంగిలను ఎగురేస్తు ఆనందంలో యువత


ఆర్మూర్‌లో...


కంఠేశ్వర్: ముగ్గువేసిన ఎమ్మెల్సీ కవిత

రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

- రవాణాశాఖ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ మామిండ్ల చంద్రశేఖర్‌గౌడ్

నవతెలంగాణ-ఆర్మూర్

రహదారి భద్రత సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని, మానవ తప్పిదాల వల్లే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని జాయింట్ ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్ అన్నారు. రహదారి ప్రమాదాలను నివారించాల్సిన బాధ్యత సమాజంలోని ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం పట్టణంలో జరిగిన రహదారి భద్రతపై అవగాహన సదస్సులో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. 75శాతం రోడ్డు ప్రమాదాలు మానవ తప్పిదాలవల్ల జరుగుతున్నాయని మిగిలిన 25శాతం వాహన కండిషన్ బాగా లేకపోవడంవల్ల జరుగుతున్నాయని తెలిపారు. పరిమితికి మించిన వేగంతో వాహనం నడపడంవల్ల, తాగి వాహనం నడపడం వల్ల, సెల్ ఫోన్తో డ్రైవింగ్ చేయడంవల్ల ఈ ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. కాబట్టి వీటిని నివారించాల్సిన బాధ్యత సమాజంలోని ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. ముఖ్యంగా యువత ఈ రోడ్డు ప్రమాదాల బారిన పడి మరణిస్తుండడం మనందరికీ ఆందోళన కలిగిస్తున్న అంశమని తెలిపారు. అవగాహన సదస్సులతో పాటు రాష్ట్రవ్యాప్తంగా తనిఖీలను కూడా నిర్వహిస్తున్నామని, త్రైమాసిక పన్ను చెల్లించని వాహన దారులు జనవరి 30 లోపల పన్ను చెల్లించాలని, లేనిపక్షంలో తనిఖీల్లో పట్టుబడితే భారీ జరిమానాతోపాటు వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. జిల్లా రవాణా శాఖ అధికారి ఉమా మహేశ్వర రావు మాట్లాడుతూ జిల్లాలో వివిధ శాఖల సమన్వయంతో రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేస్తున్నామన్నారు. పట్టణ మోటారు వాహన తనిఖీ అధికారి వివేకానంద రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని, ప్రతి వాహనం ఫిట్‌నెస్ కలిగి ఉండాలని, వాహనం నడిపే ప్రతీ డ్రైవర్, సంబంధిత డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఎంవీఐ లు రాహుల్ కుమార్, కిరణ్ కుమార్, ఏవో ప్రహ్లాద్ ఏఎంవిఐలు శ్రీనివాస్, సాగర్, పవన్ కళ్యాణ్ వివిధ వాహనాల డ్రైవర్లు, వాహన దారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ మామిండ్ల చంద్రశేఖర్‌గౌడ్

నిజామాబాద్ పోలీసులకు లోకయుక్త నోటీసులు

- ఈనెల 22న హాజరుకావాలని నోటీసు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామా బాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న ఒక సర్కిల్ ఇన్‌స్పెక్టర్, ఒక ఎస్సై, నిఘా విభాగంలో పనిచేస్తున్న ఒక హెడ్ కానిస్టేబుల్‌కు లోకాయుక్త ఈనెల 3న నోటీసులు జారీ చేసింది. రక్షించాల్సిన పోలీసులే తప్పుడు కేసులు పెట్టి యువకుల జీవితాలను నాశనం చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. కొందరు పోలీసులు తాము చేసిన తప్పులను కప్పిపుచ్చుకోవడానికి తప్పులపై తప్పులు చేస్తున్నట్లు తెలుస్తోంది. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని రెండు పోలీసుస్టేషన్ లకు సంబంధించిన పోలీసులు విచారణకు హాజరుకావాలని ఉపలోకాయుక్త నోటీసులు జారీ చేయడంపై సర్వత్రా చర్చ జరుగుతోంది. నగరంలోని 2వ, 5వ టౌన్ పోలీసులకు లోకాయుక్త ఈనెల 22న ఉదయం 10 గంటల 30 నిమిషాలకు విచారణ రావాలని నోటీసులు జారీ చేయడం సంచలనం సృష్టిస్తుంది. పోలీస్ శాఖలో గందరగోళం నెలకొంది. ఇద్దరు యువకులపై తప్పుడు కేసులు పెట్టి వేధింపులకు గురిచేసిన ఘటన విషయంలో యువకులు లోకాయుక్తలో ఫిర్యాదు చేశారు. దీంతో యువకులపై తప్పుడు కేసు పెట్టి వేధింపులకు గురిచేసిన పోలీసులు విచారణకు రావాలని ఆదేశాలు జారీ అయ్యాయి. తప్పుడు కేసు పెట్టి పోలీసులు వేధింపులకు గురి చేస్తున్నారని జిల్లా పోలీసు అధికారులకు గతంలో ఫిర్యాదు చేసినా న్యాయం జరగకపోవడంతో లోకాయుక్త ను ఆశ్రయించినట్లు సమాచారం. అధికారం ఉంది కదా అని ఇష్టానుసారంగా వ్యవహరించే పోలీసులపై పోలీసు ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. లేనట్లయితే పోలీసుల శాఖ ప్రతిష్ట దెబ్బతినే అవకాశం ఉంది. ఈ కేసులో పోలీసు ఉన్నతాధికారులు ఏం చేస్తారో చూడాల్సిన పరిస్థితి ఉంది.

నడిమి తండాలో షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం

నవతెలంగాణ -ధర్పల్లి



మండలంలోని నడిమితండాలో బుధవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో లకావత్ మహిపాల్ అనే నిరుపేదకు చెందిన నివాసపు గుడిసె దగ్ధమైనట్లు తండావాసులు తెలిపారు .మధ్యాహ్నం బాధితులు గుడిసెలోనే ఉండగా విద్యుత్ వైర్లల్లో ఒక్కసారిగా కాలినట్లు శబ్దంతో మంటలు చెలరేగాయి. వారు గమనించేలోపు గడ్డితో కప్పిన పైకప్పు కాలుతూ భారీగా మంటలు ఎగసిపడ్డాయి. కుటింబీకులు కేకలు వేస్తూ బయటికి పరుగులు తీశారు. గుడిసెలో ఉన్న బియ్యం , వంట సామాగ్రి , బట్టలు , బీరువా కాలి బూడిదయ్యాయి. ఇద్దరు చిన్న పిల్లలతో కట్టు బట్టలతో దిక్కు తోచని స్థితిలో ఉన్న నిరుపేదను ప్రభుత్వం ఆదుకోవాలని తండావాసులు కోరుతున్నారు .

విజ్ఞాన, విహారయాత్రలో మిసిమి పాఠశాల విద్యార్థులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని మిసిమి ఉన్నత ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థులు బుధవారం విజ్ఞాన, విహారయాత్రకు తరలి వెళ్లారు. ఐదు రోజుల విజ్ఞాన విహారయాత్రలో భాగంగా మొదటి రోజు రామప్ప, లక్నవరం, వేయి స్తంభాల గుడి తదితర ప్రదేశాలను విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా ప్రదేశాలకు సంబంధించిన ప్రాముఖ్యతను, విశేషాలను విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు. మిగతా రోజుల్లో వైజాగ్, అరకు, బొర్రగుహలు, సింహాద్రి అప్పన్న, రామకృష్ణ బీచ్, ద్వారక తిరుమల, భద్రాచలం, పాపికొండలు తదితర ప్రాంతాలను విద్యార్థులు సందర్శించనున్నారు.విజ్ఞాన, విహారయాత్రలో భాగంగా పలు ప్రదేశాలను సందర్శించడం పట్ల విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ బాలే రవీందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సర్వేకు ప్రజలు సహకరించాలి

- అధికారుల సూచన.. సిబ్బందికి శిక్షణ

నవతెలంగాణ-డిచ్‌పల్లి/పోతంగల్/ముప్కాల్/మోపాల్/ధర్పల్లి

రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 28 నుంచి ప్రవేశపెట్టనున్న నాలుగు పథకాలకు సర్వేకు వచ్చే సిబ్బందికి ప్రజలు సహకరించాలని తహసీల్దార్ వెంకట్రావు తెలిపారు. బుధవారం ఇందల్వాయి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ వ్యవసాయ శాఖ సిబ్బందితో ప్రత్యేక సమావేశం బుధశారం నిర్వహించారు. గురువారం నుండి మండలంలో నిర్వహించే ధరణిలో నమోదై ఉన్న వ్యవసాయ యోగ్యం కానీ భూములను గుర్తించటం జరుగుతుందన్నారు. ఇల్లు లేదా కాలనీలుగా మారిన భూములకు రియలెస్టేట్, లేఅవుట్, రోడ్లుగా మారిన భూములు, పరిశ్రమలకు, గోదాములకు మైనింగ్కు వినియోగిస్తున్న భూములు, ప్రభుత్వం సేకరించిన అన్ని రకాల భూములు రాళ్ళు, రప్పలు గుట్టలతో నిండి సాగుకు అనువుగా లేని భూములను గుర్తించాలని సూచించారు. గురువారం మండలంలోని లోలం, నల్లవెల్లి, ఇందల్వాయి రెవెన్యూ గ్రామాలకు సంబంధించిన సర్వే చేస్తారని, దీని కోసం మూడు టీమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. ఈ టీమ్లలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ మోహన్, ఏఈఓలు ప్రకాష్ గౌడ్, ప్రశాంత్, రమకాంత్ డిప్యూటీ తహసీల్దార్ శైలజ, సీనియర్ అసిస్టెంట్ గంగప్రసాద్ ఉంటారన్నారు. మండల లెవల్ అధికారిగా తహసీల్దార్ వెంకట్రావు మండల వ్యవసాయాధికారి శ్రీకాంత్ ఉంటారని తెలిపారు. రైతులు, ప్రజలు సహకరించాలని కోరారు. అధికారులకు సర్వే తీరుతెన్నులపై అవగాహన కల్పించారు. ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా చూడాలని సూచించారు. కార్యక్రమం లో మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీకాంత్ కుమార్,డిప్యుటి తహసిల్దార్ శైలజా, సీనియర్ అసిస్టెంట్ గంగ ప్రసాద్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ మోహన్, తదితరులు పాల్గొన్నారు.

పోతంగల్:రైతు భరోసా వ్యవసాయ యోగ్యమైన భూమి విస్తీర్ణం ఆధారంగా పట్టాదారులకు ఎకరానికి 12వేలు ప్రభుత్వం అందించనుందని ఏఓ నిశిత బుధవారం తెలిపారు. ఈ పథకానికి తహసిల్దార్, మండల వ్యవసాయ అధికారి బాధ్యత వహిస్తారని ఆమె అన్నారు. ప్రతి రెవెన్యూ గ్రామంలో ఆర్ఐ, ఏఇఓ లోకల్ టీ గా వ్యవహరిస్తారని ఆమె అన్నారు. గుర్తించిన భూముల జాబితాను గ్రామసభలో ప్రదర్శించి, చదివి వినిపించి చర్చించిన తరువాత ఆమోదిస్తారని తెలిపారు. దీనికోసం గురువారం నుండి సర్వే నిర్వహిస్తామన్నారు. మొదటిరోజు టీం-1 దోమలేడ్గి, హెగ్డోలి, టీం-2 కల్లూర్‌లో సెర్వే-1 నిర్వహిస్తారన్నారు. 17న హుమ్నాపూర్, కొల్లూర్‌లను, టీం-2 జల్లపల్లి, కొడిచర్లలో సర్వే చేపడతారన్నారు. 18న టీమ్ -1 సోంపూర్, సుంకిని, టీమ్ -2 పోతంగల్‌లో సెర్వే నిర్వహిస్తారన్నారు. 19న టీమ్ -1 టాక్లి, టీమ్ -2 కారేగాం, 20న టీమ్ -1 తిరుమలాపూర్, టీమ్ - 2 హంగర్గలో సెర్వే నిర్వహిస్తామ్మన్నారు. సర్వే కు అందరూ సహకరించాలని ఆమె కోరారు.

ముప్కాల్:తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డుల మంజూరు, ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా అవగాహనా సదస్సు మండల కేంద్రంలోని రైతు వేదిక సభ స్థలిలో బుధవారం నిర్వహించినట్టు ఎంపీడీవో నరేష్ ఆనంద్ తెలిపారు. ఈ నెల 16 నుండి 20 వరకు సామాజిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 21 నుండి 24 వరకు గ్రామసభలు చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి స్రవంతి, తహశీల్దార్ కృష్ణ, డిప్యూటీ తహశీల్దార్ పి.శ్రీకాంత్, మండల పంచాయతీ అధికారి గౌస్ మోహినోద్దీన్ మండల వ్యవసాయధికారి సాయి కృష్ణ, ఏపీవో ప్రసాద్ రావ్, పంచాయతీ కార్యదర్శులు మల్లేష్ యాదవ్, గౌతమి, హన్మాండ్లు, నరేష్, రాజు, విజ్ఞేష్, దేవేందర్ పాల్గొన్నారు.

మోపాల్: ఈనెల 16 గురువారం నుండి 20 వరకు రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అమలులో భాగంగా వ్యవసాయ యోగ్యం కాని భూముల గుర్తింపులో రెవెన్యూ, వ్యవసాయ శాఖ వారు సంయుక్తంగా సర్వే నిర్వహించడం జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి సౌమ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలో 3 లోకల్ టీంలను ఏర్పాటు చేశామని, ఇందులో వ్యవసాయ అధికారులు, రెవెన్యూ అధికారులు ఉంటారని ఆమె తెలిపారు.



డిచ్‌పల్లి :మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకట్రావు

ధర్పల్లి:నేటి నుండి గ్రామాల్లో అధికారులు పర్యటించనున్నారు . ఈసందర్భంగా బుధవారం ఎంపిడిఓ బాలకృష్ణ తన కార్యాలయంలో ఆయా శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు . ఈసందర్భంగా ఆయన ప్రజలు ప్రజాపాలనలో చేసుకున్న దరఖాస్తుల పరిశీలనతోపాటు రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డుల పరిశీలన చేసే విధానాలను అధికారులకు సూచించారు . అర్హులైన కుటుంబాలనుండి తీసుకోవలసిన సమాచారం, నివేదిక తయారు చేసే విధానాలపై సమావేశంలో చర్చించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మాలతీ ,మండల వ్యవసాయ అధికారు వెంకటేష్, ఏఈఒలు, ఎంపిఒ, ఎపియం, ఎపిఓ, ఈజిఎస్ సిబ్బంది, ఏఈవోలు, ఐకెపి సిసిలు, మండల రెవెన్యూ అధికారి, ఎఆర్ఐ, తదితరులు పాల్గొన్నారు .

రైతు భరోసా ప్రత్యేక అధికారులు వీరే

రాష్ట్ర ప్రభుత్వం అందించనున్న రైతు భరోసా కార్యక్రమం నేటి నుండి ప్రారంభం కానున్నదని తహసీల్దార్ మాలతీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఈనెల 16 నుండి 19 వరకు రైతు భరోసా నివేదికను తయారు చేసేందుకు ఒక్కొక్క గ్రామానికి అధికారులను నియమించినట్టు పేర్కొన్నారు. పర్యవేక్షణ అధికారులుగా తహసీల్దార్‌తోపాటు మండల వ్యవసాయ అధికారి వెంకటేష్ ఉంటారని తెలిపారు. ప్రభుత్వం తెలిపిన అంశాలపై రైతులనుండి ఆయా అంశాలను సేకరించి నివేదిక ప్రభుత్వానికి అందించనున్నారు .

మరొకరి గొంతు కోసిన ప్లాస్టిక్ మాంజా

- తీవ్రంగా గాయపడ్డ తిమ్మాపూర్ వాసి
- రెండు రోజుల్లో ఇద్దరికి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



తీవ్రంగా గాయపడ్డ ప్రవీణ్

గ్రామాల్లో సంక్రాంతి సందర్భంగా యువకులు, పిల్లలు సరదాగా ఎగురవేస్తున్న గాలిపటాల దారాలు ప్రాణం మీదకు తీసుకొస్తున్నాయి. మూడు రోజుల క్రితం మండల కేంద్రంలో గాలిపటం తెగి మూడు సంవత్సరాల రఘు అనే బాలుడి గొంతుకు ప్లాస్టిక్ మాంజా చేసిన గాయం మరవకముందే మరొకరి గొంతు కోసింది. ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన ప్రవీణ్ కుమార్ తన ఇద్దరు పిల్లలతో కలిసి పనిమీద జగిత్యాల జిల్లా మెట్ పల్లికి వెళ్ళాడు. మధ్యాహ్న తిమ్మాపూర్ తిరిగి వస్తున్న సమయంలో స్థానిక ఆంధ్ర బ్యాంకు సమీపంలో తెగిన గాలిపటంకు ఉన్న ప్లాస్టిక్ మాంజా మెడకు తగలడంతో గొంతు కోసుకుపోయింది. మాంజా గొంతును లోతుగా కోయడంతో తీవ్ర రక్తస్రావం అయ్యింది. వెంటనే ప్రవీణ్ ను స్థానికులు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అందించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం రిఫర్ చేయడంతో ఆర్మూర్ లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పండగ వేళ రెండు రోజుల్లో ప్లాస్టిక్ మాంజ మూలంగా ఇద్దరు గాయపడ్డ ఘటనలు ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ప్రభుత్వం ప్లాస్టిక్ మాంజా వినియోగంపై నిషేధం విధించినప్పటికీ, వ్యాపారులు దొంగచాటుగా విక్రయిస్తూనే ఉన్నారు. మాంజా బాలుడి గొంతు కోసిన రోజే స్థానికంగా మాంజా నమ్ముతున్న వ్యాపారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. గతంలోని ఈ ప్లాస్టిక్ మాంజను కొనుక్కున్న ఎందరో యువకులు, చిన్నారులు నిషేధంపై అవగాహన లేకపోవడంతో ప్రస్తుతం ఆ మాంజాను ఉపయోగిస్తూ పతంగులను ఎగురవేస్తున్నారు. వారు సరదాగా ఎగురవేస్తున్న పతంగుల దారం తెగి రోడ్డుపై వెళ్తున్న వారికి, ఆరు బయట నిలబడ్డ వారికి ప్రాణం మీదకు వస్తుంది. ఈ మాంజ మూలంగా కలుగుతున్న ప్రమాదాలను, దుష్పరిణామాలను గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

బస్తీ దవాఖానాల్లో నాణ్యమైన సేవలు అందించాలి

- జిల్లా వైద్యశాఖ అధికారి రాజశ్రీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

బస్తీ దవాఖానాల్లో రోగులకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించాలని నిజామాబాద్ జిల్లా వైద్యశాఖ అధికారిని రాజశ్రీ తెలిపారు. బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి రాజశ్రీ పట్టణంలోని ఖానాపూర్, నాగారం బస్తీదవాఖానాలను ఆకస్మికంగా తనిఖీ చేసి వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని, వైద్యసేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని మాట్లాడుతూ.. ప్రతి ఆశ కార్యకర్త డ్యూ లిస్టును మెయింటైన్ చేస్తూ ఒకరోజు ముందే టీకాలు ఎవరికి ఇవ్వాలో వారిని బస్తి దవాఖానాలకు వచ్చేలా చూడాలన్నారు. వ్యాక్సిన్ క్యారియర్ ఐస్ ప్యాక్సులో కూలింగ్ ఉండేలా చూడాలని తెలిపారు. బస్తీ దవాఖానాల్లో, ఆరోగ్య కేంద్రాల్లో శుభ్రతను పాటించాలన్నారు. సమయపాలన పాటిస్తూ ప్రతిరోజు ఓపిని చూడాలని, లీవ్స్ రిజిస్టర్ మైంటైన్ చేస్తూ, లీవ్స్ ను డిప్యూటీ డిఎంహెచ్వోల అనుమతి తీసుకోవాలని, డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్ఓలు వారి స్థానంలో ఇతరులను వారికి బదులు నియమించాలని కోరారు. ఖానాపూర్ బస్తి దవాఖాన స్థానిక ముదక్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి, నాగారం బస్తీ దవాఖాన వారు స్థానిక పట్టణ ఆరోగ్య కేంద్రం సీతారాం నగర్ కాలనీ నుండి సరిపడా మందులను తీసుకోవాలన్నారు. రికార్డులు మెయింటైన్ చేయాలని క్షేత్రస్థాయిలో గృహ సందర్శన చేసి వ్యాధిగ్రస్తులను బస్తీ దవాఖానాకు తరలించేలా ఆశాలు, ఏఎన్ఎం లు చూడాలని కోరారు. కార్యక్రమంలో వైద్యాధికారులు , ఏఎన్ఎం లు, ఆశాలు పాల్గొన్నారు.



టీకాలను పరిశీలిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌వో రాజశ్రీ

ముదిరాజ్ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-ఎడపల్లి

మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షులు సున్నపు వడ్డంతో పాటు సంఘం నాయకులు బోధన్ నియోజకవర్గ శాసనసభ్యులు పొద్దుటూరి సుదర్శన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు మకర సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మండల ముదిరాజ్ సంఘం 2025 క్యాలెండర్ ఎమ్మెల్యేతో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎడపల్లి మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షులు సున్నపు ఒడ్డెన్న, పెసరి ఆంజనేయులు,మనోజ్ కుమార్, యాసాడ రాజకుమార్, ముదిరాజ్ సంఘం కార్యవర్గ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.



సరస్వతి విద్యానికేతన్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నవతెలంగాణ:రెంజల్

మండల కేంద్రంలోని సరస్వతీ విద్యా నికేతన్ 2009-10లో పదో తరగతికి చెందిన విద్యార్థులు సమ్మేళనాన్ని నిర్వహించారు. గురువులను మర్చిపోకుండా అందరిని ఆహ్వానించారు. అప్పట్లోని మధురస్మృతులను తలచుకొని ఉపాధ్యాయులతో ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయ వృత్తి అతి పవిత్రమైనదని, తాము నేడు సమాజంలో మంచి గుర్తింపు తీసుకురావడానికి తమ సహాయ సహకారాలు అందించిన ఉపాధ్యాయులను వారు ఘనంగా సన్మానించారు. 15 సంవత్సరాల కిందట విడిపోయిన తాము ఒకటిగా కలవాలన్న తలంపుతో ఎంతో కష్టపడి వంశీ ఇంటర్నేషనల్ హెూటల్లో ఈ అపూర్వ సమ్మేళనాన్ని నిర్వహించడం జరిగిందని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

బుస్సాపూర్‌లో వ్యక్తి దారుణ హత్య

నవతెలంగాణ-మెండోర



దిలీప్‌శర్మ(మృతుడు)

బుస్సాపూర్ గ్రామంలో పండుగ పూట విషాదం నెలకొంది. గుర్తుతెలియని వ్యక్తులు సిమెంట్ ఇటుక రాళ్లతో కొట్టి వ్యక్తిని దారుణంగా హత్య చేశారు. వివాహేతర సంబంధం, డబ్బుల వివాదమే హత్యకు కారణమని స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మృతుని సెల్ ఫోన్ హంతకులు ఎత్తుకెళ్ళినట్లు సమాచారం. పోలీసులు డాగ్ స్క్వాడ్ తో విచారణ చేపట్టగా పక్కనే ఉన్న ముప్కాల్ మండలం నల్లూరు గ్రామంలో ఆగిపోయినట్లు తెలిసింది. డాగ్ స్క్వాడ్ నల్లూర్ లోనే ఆగిపోవడంతో హంతకుల ఆనవాళ్లు లభించకపోవడం గమనార్హం. డాగ్ స్క్వాడ్ నెల్లూరు గ్రామంలో ఆగిపోవడంతో హంతకులు అదే గ్రామానికి చెందిన వ్యక్తులు అయి ఉంటారని అనుమానాలకు తావిస్తుంది. మృతదేహాన్ని పోస్టుమార్టం చేయించి బుధవారం బుస్సాపూర్ గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. పోలీసుల కథనం ప్రకారం.. మహారాష్ట్రలోని బాడాపూర్ గ్రామానికి చెందిన దిలీప్ శర్మ (36) మెండోర మండలం బుస్సాపూర్ గ్రామంలో నవలె ప్రకాష్(పిఎంపి) నిర్వహిస్తున్న పవన్ క్లినిక్‌లో 10 సంవత్సరాలుగా కంపౌండర్‌గా విధులు నిర్వహిస్తూ క్లినిక్ వెనకాల ఉన్న రూం లో భార్య పిల్లలతో పాటు కిరాయికి ఉంటున్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా భార్య సాగరిక ఇద్దరు పిల్లలను తీసుకుని ఈనెల 13న సొంత గ్రామం అయిన బడాపూర్ వెళ్ళింది. మరుసటి రోజు మంగళవారం ఉదయం పవన్ క్లినిక్ నిర్వాహకులు పిఎంపి డాక్టర్.ప్రకాష్ క్లినిక్ కు వచ్చి చూడగా ముందర గేట్‌కు తాళం వేసి ఉండటంతో ఇంటివద్ధకు వెళ్లి చూడగా ఇల్లుకు బయట తాళం వేసి ఉంది. ఇంటి బయట చెప్పులు , మోటార్ సైకిల్ ఉండటంతో హాస్పిటల్ సిబ్బంది సహాయంతో ఇల్లు తాళం పగులగొట్టి ఇంటిలోపలికి వెళ్లి చూడగా తలకు రక్తంతో కూడిన గాయలతో చనిపోయి ఉన్నాడని తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు సిమెంట్ ఇటుక రాళ్లతో తల పగులగొట్టి చంపేశారని మృతుని భార్య సాగరిక ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నారాయణ పేర్కొన్నారు. నెల్లూరు గ్రామానికి చెందిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. స్థానిక ఎస్ఐని సమాచారం కోరగా విచారణ కొనసాగిస్తున్నామని సమాధానం ఇచ్చారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

నవతెలంగాణ-కంఠేశ్వర్

నగరంలోని ఒకటవ పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడని ఎస్‌హెచ్ఓ రఘుపతి తెలిపారు. ఎస్‌హెచ్ఓ తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ రైల్వే స్టేషన్ దగ్గర అపస్మారక స్థితిలో వ్యక్తి పడి ఉన్నారని తెలిపారు. వ్యక్తి వయస్సు 55 నుంచి 60 సంవత్సరాలు ఉంటుందని చికిత్స నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో 7న చికిత్స గురించి అడ్మిట్ చేసినట్టు తెలిపారు. చికిత్స పొందుతూ ఆయన 9న మృ చెందాడని ఎస్‌హెచ్ఓ తెలిపారు. భిక్షాటన చేసుకునే వ్యక్తిగా ఉన్నాడన్నారు. ఇతనికి సంబంధించిన సమాచారం ఎవరికైనా తెలిస్తే వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ నిజామాబాద్‌లో ఫోన్ నెంబర్ 8712659714కు సంప్రదించాలని తెలిపారు.

రసవత్తరంగా క్రికెట్ టోర్నమెంట్

- నాలుగేండ్లుగా నిర్వహిస్తున్న సొసైటీ చైర్మెన్ అల్లె జనార్దన్

నవతెలంగాణ-బోధన్



టోర్నమెంట్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

సాలూర మండల కేంద్రంలో సంక్రాంతి పండగను పురస్కరించుకుని నిర్వహిస్తున్న సీజన్-4 క్రికెట్ టోర్నమెంట్ రసవత్తరంగా కొనసాగుతుంది. సాలూర సహకార సంఘం చైర్మెన్ అల్లె జనార్దన్ క్రీడాకారులను ప్రోత్సాహించాలనే ఉద్దేశంతో సాలూర క్రికెట్ టోర్నమెంట్, సీజన్-4 పేరుతో గత నాలుగేళ్లుగా ఆయన సంక్రాంతి సందర్భంగ క్రికెట్ టోర్నమెంట్ లను నిర్వహిస్తున్నారు. బోధన్, సాలూర మండలంలోని పలు గ్రామాలకు చెందిన క్రీడాకారులు ఈ టోర్నమెంటులో పాల్గొన్నారు. మొత్తం 34 టీంలు పాల్గొన్నాయి. గురువారం ఫైనల్, సెమీ ఫైనల్ మ్యాచ్ లు నిర్వహించడానికి సన్నాహాలు చేపడుతున్నట్లు టోర్నమెంట్ నిర్వాహకులు, సొసైటీ చైర్మెన్ అల్లె జనార్దన్ తెలిపారు. విన్నర్ కు రూ.22,222 ప్రైజ్ మనీ, ద్వితీయ స్థానంలో నిలిచిన వారికి రూ.11,111 ప్రజ్ మనీ అందించడం జరుగుతుందని తెలిపారు. గ్రామీణ ప్రాంత యువ క్రీడాకారులను ప్రోత్సాహించి వారిని రాష్ట్ర స్థాయి క్రికెటర్లుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో నాలుగేళ్లుగా టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

అధ్యాపకుల సంఘం జిల్లా ఇన్‌ఛార్జిగా మండలోజు నర్సింహస్వామి

నవతెలంగాణ - భీంగల్ రూరల్

తెలంగాణ బీసీ లెక్చరర్స్ అసోసియేషన్‌లో నిజామాబాద్ జిల్లా ఇన్చార్జిగా భీంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల తెలుగు అధ్యాపకుడికి స్థానం దక్కింది. హైదరాబాదులో ఆ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు భీంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలుగు లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ మండలోజు నర్సింహ స్వామిని నిజామాబాద్ జిల్లా ఇన్చార్జిగా ఎన్నుకున్నారు.

కాంగ్రెస్ పార్టీని విమర్శిస్తే ఖబర్దార్ కవిత

- పోచారం శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్ ఎమ్మెల్యే కాదు..
- ఆయనను మీరు ఎంతైనా తిట్టుకోండి..
- బాన్సువాడ నియోజకవర్గ ఏనుగు గ్రూప్ నాయకులు

నవతెలంగాణ-వర్ని


ఇల్లు ఆలూకాగానే పండగ కాదు,.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి కొద్దీ రోజులైన రైతులకు రుణమాఫీ చేసిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిదే అని బాన్సువాడ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఏనుగు రవీందర్ రెడ్డి గ్రూప్ నాయకులు మాజీ బాన్సు వాడ మార్కెట్ కమిటీ చైర్మన్ పాత బాలకృష్ణ, మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు యలమంచిలి శ్రీనివాస్ రావు అన్నారు. బుధవారం వర్ని మండల కేంద్రంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు రోజుల క్రితం ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత బడాపహాడ్‌కు విచ్చేసి బాన్సువాడలో విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ చేతకాని పార్టీ, ప్రజలను మోసం చేస్తున్న పార్టీ అని నోటికొచ్చినట్లు మాట్లాడటం సరికాదన్నారు. బీఆర్ఎస్ పదేళ్ళ పాలనలో ప్రజలకు సంక్షేమ పథకాలు ఇస్తే పేదలకు డబుల్ బెడ్ రూమ్‌లు ఇస్తే ప్రజలు మిమ్మల్ని ఎందుకు ఓడించారో చెప్పాలన్నారు. మీరు ఎంఎల్‌సి అనే విషయం ఇక్కడి నియోజకవర్గ ప్రజలకు మీకు మీరు చెప్పుకొనే వరకు తెలియదని, ఎప్పుడైనా బాన్సువాడ నియోజకవర్గంకు వచ్చారా.. ప్రజలను కలిసారా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది లో ఏకకాలంలో రైతు రుణమాఫీ, రైతులకు బోనస్‌గా క్వింటాలుకు 500 రూపాయలు ఇచ్చింది ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి అని గుర్తు చేశారు. పాలనపై లేనిపోని ఆరోపణలు చేస్తే ఖబర్దార్ కవిత అని హెచ్చరించారు. కేసీఆర్ పాలనలో మత కల్లోలాలు జరుగ లేదని అంటున్నారు. ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో మతకల్లోలాలు జరుగుతున్నాయని అంటే అవి మీ కుట్రలే, అమాయక ప్రజలకు పురికొల్పుతుంది బీఆర్ఎస్ పార్టీయే అని అన్నారు. బాన్సువాడ అభివృద్ధి కోసం కేసీఆర్ ఏడాదికి 1000 కోట్లు రూపాయలు చొప్పున 10 ఏండ్లకు 10 వేలకోట్లు పోచారంకు ఇస్తే ఎక్కడ అభివృద్ధి జరిగిందో చూపాలని, ఆ కోట్లు పోచారం శ్రీనివాస్ రెడ్డి కొడుకులు జేబులు నింపుకొన్నారేమో అడుగు అంతే కానీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శిస్తే బాన్సువాడ మీద అడుగు పెట్టనివ్వబోమని హెచ్చరించారు. పోచారం భాస్కర్ రెడ్డి ఇసుక మాఫియాలో దోచుకున్నారో. రైస్ మిల్లర్ల వద్ద కోట్లు దండుకొన్నారో.. అందులో మీకు ఎంత వాటా ఇచ్చారో కవిత చెప్పాలన్నారు. మీరు పోచారం ఒకే పార్టీ,. రాష్ట్రంలో మీ కుటుంబం నియోజకవర్గంలో పోచారం కుటుంబం దొంగల పాలనలా జరిగిందని విమర్శించారు. మీరు పోచారం శ్రీనివాస్ రెడ్డి ని తీటండి, పోచారం శ్రీనివాస్ రెడ్డి ని ప్రశ్నించుకొండి మాకు ఎలాంటి అభ్యతరం లేదన్నారు. పోచారం ఇప్పటికి కాంగ్రెస్ ఏమ్మెల్యే కాదు..బీ ఆర్ఎస్ ఎమ్మెల్యే అని, కాంగ్రెస్ ఎమ్మెల్యేను అని అయన ఏ సభలలో కూడా చెప్పుకోలేదని అన్నారు. పోచారం, అయన కొడుకులు, మీరు, మీ కుటుంబం అంత ఒక్కటే అది ప్రజలకు తెలుసు అని అన్నారు. సమావేశంలో ఏనుగు రవీందర్ రెడ్డి గ్రూప్ నాయకులు యలమంచిలి శ్రీనివాస్ రావు, రమేష్ రాథోడ్, జంగం గంగప్ప, మాసాని శ్రీనివాస్, గ్రామాల కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

వృద్ధురాలు అదృశ్యం

నవతెలంగాణ-ముప్కాల్



మండలంలోని నాగంపేట గ్రామానికి చెందిన పాకనాటి లక్ష్మీ (67) కనబడడం లేదని కొడుకు పాకనటి రాజు మంగళవారం పోలీసులకు పిర్యాదు చేశారు. పాకనాటి లక్ష్మీ నెల రోజుల క్రితం కంటి ఆపరేషన్ చేయించుకుందని, అప్పటి నుండి ఆమె మానసిక ఆరోగ్య పరిస్థితి బాగుండక ఈ నెల 12న ఎవరికి చెప్పకుండ బయటికి వెళ్లింది. తిరిగి ఇంటికి రాలేదు. చుట్టూ పక్కల, బంధువుల ఇండ్లలో ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. ఆమె కొడుకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసుగా నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వి.రజినీకాంత్ తెలిపారు..